ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ జిల్లా వార్తలు
శుక్రవారం 27 డిసెంబరు 2024 | 5



చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం

- ఇద్దరు గిరిజన యువకులు మృతి
- శంఖవరం మండలంలో ఘటన

7

పర్యాటకులకు విజ్ఞానం.. వినోదం

6

- నెలాఖరుకు ప్రారంభం కానున్న యుద్ధ విమానం





బాటిల్‌తో చేపల వేట!

- యానాం గోదావరిలో చిక్కుతున్న చేపలు
- వైరల్ అవుతున్న వీడియోలు

6



గోదావరిలో అరుదైన అతిథులు

6

- ఆలమూరు వద్ద పక్షుల సందడి



అక్రమార్కులను మట్టి కలిపేస్తారా..?: పోలవరం కాలువ గట్టుపై కరిగిపోయిన మట్టి మేటలు

మహా మేతలు!

పోలవరం మట్టినీ మింగేసిన వైసీపీ నేతలు

- రూ.350 కోట్లు హాంఫట్
- అక్రమార్కులపై కానరాని చర్యలు
- ప్రభుత్వం మారినా అదే తీరు
- విజిలెన్స్ విచారణకూ దూరం
- కాలవ గట్టుపై మట్టి మాయం
- పేదల స్థలాల చదును ముసుగు
- భారీగా అక్రమ మట్టి తవ్వకాలు
- రియల్‌ఎస్టేట్‌కు విక్రయాలు
- లేఅవుట్లకు తరలింపు
- కోట్లకు పడగలెత్తిన నేతలు
- కొమరగిరిలో రూ.6 కోట్లు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందల కోట్ల విలువైన పోలవరం మట్టిని మింగేసిన అక్రమార్కులపై చర్యలకు అధికారులు ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. అప్పట్లో పేదల ఇళ్ల స్థలాలకు పోలవరం మట్టిని తవ్వి తరలించడానికి కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల కలెక్టర్లు తాత్కాలిక అనుమతులివ్వగా.. ఆ ముసుగులో మొత్తం మట్టంతా మింగేశారు. అప్పటి వైసీపీ ఎమ్మెల్యేలు తెర వెనుక ఉండి సాగించిన దందాతో కోట్లకు కోట్లు కూడబెట్టారు. అదే సమయంలో గనుల శాఖకు రాయల్టీ సైతం చెల్లించకుండా పంగనామాలు పెట్టేశారు. ఒకరకంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండిపడింది. ప్రభుత్వం మారడంతో అక్రమార్కులపై చర్యలు తప్పవని అంతా భావించారు. కూటమి సర్కారు గద్దెనెక్కినా విజిలెన్స్ విచారణకు అతీగతీ లేకుండాపోతోంది. ఎందుకో తెలియదుగానీ అధికారుల నుంచి ప్రభుత్వానికి నివేదికలు పంపకుండా తాత్సారం జరుగుతోంది. ఇప్పటికే కాకినాడ కేంద్రంగా గడచిన ఐదేళ్లలో చోటు చేసుకున్న రేషన్ బియ్యం అక్రమాలు, టీడీఆర్ బాండ్లలో కోట్లు కొట్టేసిన దొంగలపై విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. కానీ అదే స్థాయిలో రూ.350 కోట్లకుపైగా మట్టిలో మెక్కేసిన దొంగలపై అసలు విచారణ దిశగా అడుగులు పడకపోవడంతో అక్రమార్కులు దర్జాగా తిరుగుతున్నారు.

మట్టంతా మింగేశారంతే..

కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో పోలవరం ఎడమ ప్రధాన కాలువ వంద కిలోమీటర్లమేర విస్తరించి ఉంది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం దగ్గర మొదలయ్యే ఈ కాలువ గోకవరం, కోరుకొండ, రాజానగరం, గండేపల్లి, ప్రత్తిపాడు, జగ్గంపేట, గొల్లప్రోలు, శంఖవరం, తొండంగి, తుని మండలాల మీదుగా వెళుతోంది. గతంలో ఈ కాలువను 18మీటర్ల లోతుకు వరకు తవ్వారు. దీంతో దాదాపు నాలుగు కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి వచ్చింది. దీన్నంతటిని కాలువకు ఆనుకుని ఉన్న భూముల్లో 15 అడుగుల ఎత్తు వరకు మేటల రూపంలో పోగేశారు. అయితే వైసీపీ రాక ముందు టీడీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో దీనివైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. వేసిన మట్టిదిబ్బలు వేసినట్టే ఉన్నాయి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడికక్కడ అప్పటి అధికార పార్టీ నేతలు మట్టిపై గద్దల్లా వాలిపోయారు. ఆ మట్టిని రియల్ ఎస్టేట్ అవసరాలకు విక్రయించేశారు. ప్రధానంగా రాజానగరం, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని నియోజకవర్గాల పరిధిలో పోలవరం మట్టిని గడచిన ఐదేళ్లలో అనుమతులతో సంబంధం లేకుండా గుట్టుచప్పుడుకాకుండా పదుల సంఖ్యలో పొక్లెయినర్లు పెట్టి వేలాది టిప్పర్లతో తరలించేశారు. ఒక్కో టిప్పర్ మట్టిని రూ.8 వేలకు కాకినాడ, రూ.12 వేలకు తాళ్లరేవు, యానాం, రూ.4వేలకు పిఠాపురం, రూ.15 వేలకు కోనసీమలో అనేక రియల్ఎస్టేట్ స్థలాల చదునుకు విక్రయించి కోట్లు గడించేశారు. ప్రత్తిపాడు, పిఠాపురం నియోజకవర్గాల పరిధిలో చెందుర్తి జాతీయ రహదారి పక్కనే పోలవరం కాలువ వెంబడి కోటిన్నర లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి మేటలు, తునిలో 70 లక్షలకుపైగా క్యూబిక్ మీటర్ల మట్టి నిల్వలను కాజేశారు. దీన్నంతటిని అప్పట్లో ముగ్గురు ఎమ్మెల్యేలు తమ అనుచరుల ద్వారా యథేచ్ఛగా తరలించుకుపోయారు. నిబంధనల ప్రకారం ఈ మట్టిని తవ్వాలంటే జలవనరుల శాఖ, గనుల శాఖకు డబ్బులు చెల్లించాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వంలో నిబంధన లేవీ పని చేయకపోవడంతో ఎవరికివారు మట్టితో కోట్లు కొల్లగొట్టారు. గనులు, జలవనరులశాఖాధికారులు కమీషన్లు పుచ్చుకుని కళ్లు మూసుకోవడంతో పోలవరం మట్టి 90 శాతానికిపైగా మాయమైపోయింది. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లో ఆరున్నర కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి మాయమై పోయింది. ముఖ్యంగా ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల పరిధిలో కొండలు, గుట్టల మీదుగా పోలవరం కాలువ తవ్వడం వల్ల ఇతర ప్రాంతాలకంటే ఎక్కువ మట్టి పోగైంది. గడచిన ఐదేళ్లలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యేల హోదాలో పర్వత ప్రసాద్, దాడిశెట్టి రాజాకు చెందిన అనుచరులు పోలవరం మట్టితో రెండు జేబులూ నింపేసుకున్నారు.

మట్టి మింగేశారిలా..

పిఠాపురం నియోజవర్గం యు.కొత్తపల్లి మండలం కొమరిగిరిలో 350 ఎకరాల్లో సీఎం జగన్ చేతుల మీదుగా 2021 డిసెంబర్ 25న పేదలకు ఇళ్ల స్థలాలు పంచారు. ఈ భూములు సముద్రానికి అతి సమీపంలో ఉండడంతో చిన్నపాటి వర్షాలకు ముంపునకు గురవుతాయి. ఈ లేఅవుట్‌ను లక్షల క్యూబిక్ మీటర్ల మట్టితో చదునుచేశారు. ఇందుకు గొల్లప్రోలు మండలం చెందుర్తి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న పోలవరం కాలువ మట్టిని వేలాది టిప్పర్లలో కొన్ని వారాలపాటు తరలించారు. ఈ లేఅవుట్ చదునుకు ఎంత పరిమాణంలో పోలవరం మట్టి తరలించాలనే దానిపై అప్పటి కలెక్టర్ మురళీధర్‌రెడ్డి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయలేదు. కానీ చదును ముసుగులో అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి వేలాది టిప్పర్లలో పోలవరం మట్టి తరలించారు. వాస్తవానికి పోలవరం మట్టిని ఇళ్ల స్థలాల అవసరాలకు ప్రభుత్వం తాత్కాలిక అనుమతులు ఇచ్చినప్పుడు రోజుకు ఎన్ని టిప్పర్లు మట్టి తరలిస్తున్నారు? అసలు ఎంత తవ్వుతున్నారు? వంటి వివరాలు అధికారులు లాగ్‌బుక్‌లో నమోదుచేయాలి. కానీ అప్పట్లో ఇదేదీ జరగలేదు. తవ్వుతున్న మట్టిలో ప్రభుత్వ అవసరాలకు ఎంత వెళ్తుంది? రియల్ ఎస్టేట్ అవసరాలకు ఎంత పంపుతున్నారనేది పట్టించుకోలేదు. దీంతో అప్పట్లో కాకినాడ కీలక నేత ఒక్కరే పోలవరం మట్టిలో రూ.6 కోట్ల వరకు మింగేశారు.

రూ.350 కోట్లు వస్తాయని లెక్క..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఖజానాకు నిధులు సమకూర్చడం కోసం ఉమ్మడి ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల్లో 12కోట్ల క్యూబిక్‌మీటర్ల పోలవరం మట్టిని విక్రయించి రూ.900 కోట్ల ఆదాయం రాబట్టాలని 2019లో భావించింది. ఈ మేరకు మంత్రుల కమిటీ ఏర్పాటుచేసి అంచనా వేయించింది. ఒక్క ఉమ్మడి తూర్పుగోదావరిలోనే మట్టిని వేలం వేస్తే రూ.350 కోట్ల వరకు రాబట్టవచ్చని అధికారులు లెక్కగట్టారు. మట్టిని విక్రయించడానికి వీలుగా రాష్ట్ర గనులశాఖ పరిధిలోకి పోలవరం కాలువలను తీసుకురావాలని అప్పట్లో మంత్రుల సమావేశం నిర్ణయించింది. ఆ తర్వాత వేలం విషయం ప్రభుత్వం మర్చిపోయింది. దీంతో ఐదేళ్లలో వైసీపీ నేతల దోపిడీతో మట్టి ద్వారా ఖజానాకు రావలసిన కోట్లు నేతల జేబుల్లోకి వెళ్లిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్న నేపథ్యంలో పోలవరం మట్టి మేతపై విచారణ జరుగుతుందని అంతా భావించారు. పైగా అసెంబ్లీలోను మట్టి మాఫియా అంశంపై చర్చ జరిగింది. కానీ ఇప్పటివరకు విజిలెన్స్ అధికారులు విచారణకు రంగంలోకి దిగలేదు. పోలవరం మట్టి మాయం ద్వారా గనులశాఖ రాయల్టీ ఆదాయానికి గండిపడిందనే కోణంలో దర్యాప్తు జరుగుతుందని అధికారులు చెప్పినా, ఇంతవరకు అసలు ఉలుకుపలుకూ లేదు. ఇప్పటికే కాకినాడలో రేషన్ మాఫియా అంతు తేల్చడానికి ప్రభుత్వం సిట్‌ను నియమించి దర్యాప్తు చేయిస్తోంది. కాకినాడలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై విజిలెన్స్ విచారణ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో పోలవరం మట్టి అక్రమాలపైనా విజిలెన్స్‌తో విచారణ చేయించాల్సిన అవసరం ఉంది.

ఒకరోజు ముందుగానే పింఛన్లు

- ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌దారులకు శుభవార్త
- కొత్త సంవత్సరం కావడంతో కూటమి ప్రభుత్వం నిర్ణయం
- రూ.116 కోట్లు విడుదల

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌దారులకు శుభవార్త. ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు ఈ పర్యాయం ఒకరోజు ముందుగానే ఈనెల 31వ తేదీన ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు కాకినాడ జిల్లాలో 2,73,202 మందికి రూ.116 కోట్ల 80 లక్షలు ఇవ్వడానికి అధికారి యంత్రాంగం సర్వం సిద్ధంచేసింది. దీనిలో ఓఏపీ, వితంతు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, చేనేత కార్మికులు, డప్పు కళాకారులు, అభయహస్తం, చిత్రకారుల పింఛన్లు ఉన్నాయి. ఇంగ్లీషు క్యాలెండర్ ప్రకారం జనవరి 1వ తేదీన కొత్త సంవత్సరం ప్రవేశించడంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం చూడాలనే లక్ష్యంతో ఒకరోజు ముందుగానే పింఛన్ల పంపిణీకి యంత్రాంగం సర్వం సిద్ధంచేసింది. ఈనేపథ్యంలో మున్సిపల్ కమిషనర్లు, ఎండీవోలు, గ్రామ, వార్డు, సచివాలయం ఉద్యోగులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. తొలిరోజే నూరుశాతం పింఛన్లు పంపిణీ చేయాలనే సంకల్పంతో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉన్నారు. ఆమేరకు కలెక్టర్ ప్రత్యేకంగా ఆదేశాలు సైతం జారీచేశారు.

పింఛన్‌దారుల్లో సంతోషం

కొత్త సంవత్సరం నేపథ్యంలో ఒకరోజు ముందే పింఛన్లు పంపిణీ చేస్తుండడంపై పింఛన్‌దారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నడూలేనివిధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

కొనసాగుతున్న మూడో ప్రమాద హెచ్చరిక

- నేటి మధ్యాహ్నానికి తెరుపు ఇవ్వనున్న వాతావరణం
- సముద్రంలో కొనసాగుతున్న తీవ్రగాలుల ఉధృతి
- ఎనిమిది నౌకల్లో ఆగిన బియ్యం ఎగుమతి

కాకినాడ, కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం బలహీనపడింది. ప్రస్తుతం అల్పపీడనం కొనసాగుతోంది. దీంతో కాకినాడ పోర్టులో మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. దీని ఫలితంగా సముద్రంలో అలల ఉధృతి, గాలుల తీవ్రత అధికమైంది. గురువారం రాత్రి సముద్రంలో 30 నాట్స్‌గా గాలుల తీవ్రత ఉంది. గురువారం కూడా ఎనిమిది భారీ నౌకల్లో బియ్యం లోడింగ్ నిలిచిపోయింది. అయితే హోప్‌ఐల్యాండ్ సమీపంలో రెండు నౌకల్లోకి కొంచెం కొంచెంగా లోడింగ్ జరుగుతోంది. కాగా బలహీనపడిన అల్పపీడనం శుక్రవారం సాయంత్రానికి పూర్తిగా బలహీనపడి వాతావరణం అనుకూలించనుందని వాతావరణశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో స్టెల్లాఎల్ నౌక నుంచి రేషన్ బియ్యాన్ని బార్జిలోకి దింపే అవకాశం ఉంది.

తీరంలో ఈదురుగాలులు

కొత్తపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం తగ్గుముఖం పట్టినా గురువారం ఉప్పాడ తీరంలో సముద్ర కెరటాల ఉధృతి కొనసాగుతూనే ఉంది. కొత్తపల్లి మండలంలోని తీర ప్రాంత గ్రామాలకు చెందిన మత్స్యకారులు సముద్రంపైకి వేటకు వెళ్లి నెల కావస్తోంది. అప్పటి నుంచీ వరుస అల్పపీడనాలు, తుపాన్లు సంభవించడంతో మత్స్యకారుల జీవనోపాధికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఈనెలంతా మత్స్యకారులు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. సముద్రంలో అలల ధాటికి ఇళ్లు కొట్టుకుపోయినా ఎలాంటి సాయం అందలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

గ్రామీణ రహదారులకు
మహర్దశ

- గత వైసీపీ పాలనలో అధ్వానంగా మారిన వైనం
- కూటమి ప్రభుత్వంలో నిధుల వరద
- జిల్లాలో 145.11 కి.మీటర్ల మేర 1,052 సీసీ రోడ్లు
- పెద్దాపురం నియోజక వర్గంలో రూ.10 కోట్లతో నిర్మాణ పనుల జోరు

సామర్లకోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టింది. గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థలు నిర్వీర్యం అయ్యాయి. గ్రామాల్లో ఒక్క రోడ్డు నిర్మాణం కూడా చేపట్టలేదు. దీంతో గ్రామాల్లోని రహదారులు గుంతలమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో మురికి కూపాలుగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పల్లెల్లో పండుగ వాతావరణం తీసుకువచ్చారు. పల్లె పండుగ పేరుతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణాలతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ప్రధానంగా సీసీ రోడ్ల నిర్మాణం జోరుగా సాగుతోంది. ఆర్థిక సంఘం నిధులు కూడా విడుదల కావడంతో అన్ని రకాల పనులూ చేపడుతున్నారు. జిల్లాలో పంచాయతీరాజ్‌శాఖ ద్వారా జాతీయ ఉపాధి హామీ నిధులతో మొత్తం 1,052 సీసీ రోడ్ల పనులు చేపట్టారు. ఇందులో 145.11 కిలోమీటర్ల పొడవు గల సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.96.38 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో ఇప్పటికే 53 కిలోమీటర్ల పొడవు గల 269 సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన సీసీ రోడ్ల నిర్మాణపు పనుల్లో దాదాపు 45 నుంచి 85 శాతం మేర పూర్తికాగా, పది రోజుల్లో 90 శాతం పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని పంచాయతీ రాజ్ సూపరింటిండెంట్ ఇంజనీర్ మల్లిఖార్జున రావు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. దీంతో రానున్న కొత్త సంవత్సరంలో సంక్రాంతికి జిల్లాలో అన్ని గ్రామీణ ప్రాంతాల్లో పల్లె పండుగ రోడ్లు సంక్రాంతి శోభను తీసుకురానున్నాయి. కాగా పెద్దాపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రత్యేక కృషి మేరకు రూ.20 కోట్ల నిధులు మంజూరు చేయించడమేగాక 30 సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. వేట్లపాలెం, ఆనూరు, చదలాడ గ్రామాల్లో నాలుగు సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తిచేయగా మిగిలిన 26 పనులు సుమారు 75 శాతం పూర్తయ్యి మిగిలిన పనులు జనవరి మొదటి వారానికి పూర్తికానున్నట్టు పంచాయతీరాజ్ పెద్దాపురం డివిజన్ సహాయ ఇంజనీరు కె.శ్రీనివాసరావు తెలిపారు. రెండవ విడత నిధులుగా మరో రూ.10 కోట్ల నిధులకుగాను 26 పనులకు రూ.4.15 కోట్ల మేర ఇటీవల విడుదల అయ్యాయన్నారు. ఈ నిధులతో కూడా సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాల్సివుంది. గత వైసీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరుకాక ఆ పార్టీ సర్పంచ్‌లు కూడా అసహనం వ్యక్తం చేసేవారు. కూటమి ప్రభుత్వంలో పంచాయతీల్లోని రహదారులు, సైడ్ కాలువల పనులు జరుగుతుండడంతో తమ పదవీకాలం ముగిసేలోపు గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని వైసీపీ సర్పంచ్‌లే హర్షం వ్యక్తంచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులు మునుపెన్నడూలేని రీతిలో చకచకా జరుగుతుండడంతో కూటమి ప్రభుత్వంలో ప్రజల కష్టాలు తొలగుతున్నాయని గ్రామీణులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి అభివృద్ధి పనుల్లో భాగంగా ఈ పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేసేలా ఆయా ప్రాంతాలకు చెందిన తెలుగుదేశం, జనసేన నాయకులకు బాధ్యతలు అప్పగించారు.



సామర్లకోట మండలం వేట్లపాలెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

తారురోడ్లకూ మోక్షం



నాయకంపల్లి - జడ్.రాగంపేట రహదారి ఇదే

గండేపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల నుంచి అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ తారురోడ్లకు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మోక్షం కలిగిస్తోంది. ఇప్పటికే గండేపల్లి నుంచి రామయ్యమ్మపాలెం, సింగరంపాలెం రోడ్డుకు రూ.70 లక్షలు, తాళ్లూరు నుంచి యల్లమిల్లి రహదారికి రూ.30 లక్షలతో తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు నాయకంపల్లి నుంచి జడ్.రాగంపేట వరకు, యల్లమిల్లి క్వారీ రోడ్డు వరకు రూ.కోటి నిధులతో రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికే రూ.2కోట్లకుపైగా ప్రభుత్వం తారురోడ్లకు కేటాయించింది. సంక్రాంతిలోపు రోడ్డు నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆర్‌అండ్‌బీ జేఈ సాయికిరణ్ చెప్పారు.

గోదాములపై పర్యవేక్షణ నిల్

- తనిఖీలు చేయాల్సిన అధికారులే నిర్లక్ష్యం.. ప్రతినెలా విధిగా తనిఖీలు చేయాలి
- రేషన్ బియ్యం మాయమయ్యే వరకు ఏమి చేశారు.. కొరిపల్లి గోదాముపై ఉచ్చు
- 2016 నుంచి ఇప్పటివరకు రికార్డులు పరిశీలిస్తున్నాం : జిల్లా జాయింట్ కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం నిల్వచేసిన గోదాములను పర్యవేక్షణ చేయడంలో అధికారుల నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోంది. ప్రతి నెలా ఆయా గోదాములను స్వయంగా అధికార్లు వెళ్లి స్టాక్‌రికార్డుతోపాటు బియ్యం నిల్వలను పరిశీలించాలి. అయితే అధికారులు వీటిని గాలికొదిలేశారనే ఆరోపణలు ఉన్నాయి. కరప మండలం కొరిపల్లిలో అద్దె గోదాములో నిల్వ ఉంచిన రేషన్ బియ్యం 229 మెట్రిక్ టన్నులు మాయమైంది. దీని విలువ రూ.కోటి ఉంటుంది. పౌరసరఫరాల సంస్థ ఈ గోదాములో 2016 నుంచి రేషన్ బియ్యం నిల్వ చేస్తోంది. అయితే తొమ్మిదేళ్ల నుంచి రికార్డులను, గోదాములో ఉన్న బియ్యాన్ని ఎన్ని పర్యాయాలు అధికారులు తనిఖీలు చేశారో అర్థంకావడం లేదంటున్నారు. కోటి రూపాయల బియ్యం పక్కదారి పట్టేవరకు దీనిపై దృష్టి పెట్టకపోవడం దారుణమని విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో గోదాముల్లో స్టాక్ నిర్వహణ అస్తవ్యస్తమైంది. వైసీపీ నేతలు చెప్పినట్టు అధికారులు తలూపడంవల్లే ఇలాంటి దుస్థితి నెలకొంది. మచిలీపట్నంలో మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబానికి చెందిన గోదాంలో పీడీఎస్ బియ్యం మాయమైన విషయం తెలిసిందే. దీనిపైన అక్కడ విచారణ జరుగుతోంది. కొరిపల్లిలో కూడా మాయం అవ్వడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. కొరిపల్లి గోదాం యజమానిపై చర్యలు తీసుకోవడంతోపాటు రికవరీకి రికవరీకి ఉన్న అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. 2016 నుంచి ఇప్పటివరకు కొరిపల్లి గోదాంలో రేషన్‌బియ్యం నిల్వచేస్తున్నారు. దీంతో తొమిదేళ్ల నుంచి రికార్డులను పరిశీలిస్తున్నామని, రేషన్ బియ్యం మాయంపై మరో వారం రోజుల్లో సమగ్ర నివేదిక రూపొందించి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్‌కు పంపిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా చెప్పారు.



కరపలో పోలీసుల నుంచి గార్డ్ ఆఫ్ హానర్ స్వీకరిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

కరప పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన రేంజ్ ఐజీ

కరప, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ గురువారం కరప పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆయన రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు ఎక్కువగా వస్తున్న ఫిర్యాదులు, కేసుల పురోగతి, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. నేరాల అదుపునకు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని పేర్కొంటూ, క్రైమ్ రేట్ పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కోడిపందేలు, జూదం, గుండాట వంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను తనిఖీచేసి స్టేషన్ పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. ముందుగా ఐజీ అశోక్‌కుమార్‌కు కరప ఎస్ఐ తోట సునీత పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్, ట్రైనీ ఎస్పీ, సీఐ చైతన్యకృష్ణ పాల్గొన్నారు.

పర్యాటకులకు.. వినోదం.. విజ్ఞానం



కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌లో సందర్శకులకు విజ్ఞానం పంచనున్న యుద్ధ విమానం

సాయం సమయాన.. సాగరతీరాన.. ఆహ్లాదకర వాతావరణంలో గడపాలంటే కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు వెళ్లాల్సిందే.. అక్కడి అందాలను తిలకించడానికి విచ్చేసే పర్యాటకులకు ఇకపై యుద్ధ విమానం మ్యూజియం స్వాగతం పలకనుంది. భారత నావికాదళానికి రక్షణ రంగంలో 28 ఏళ్లపాటు సేవలందించిన టీయూ-142 యుద్ధ విమానం మ్యూజియం జిల్లావాసులకు కనువిందు చేయనుంది. అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఈనెలాఖరులోపు సందర్శకులకు మ్యూజియాన్ని తిలకించేందుకు అనుమతి ఇవ్వనున్నారు. ఈ విమాన మ్యూజియంపై ప్రత్యేక కథనం.

- నెలాఖరుకు ప్రారంభం కానున్న టీయూ 142 యుద్ధ విమానం
- వినియోగంలోకి రానున్న ఎన్టీఆర్ బీచ్ యుద్ధ విమాన మ్యూజియం



(ఆంధ్రజ్యోతి-సర్పవరం జంక్షన్)

ఉమ్మడి జిల్లాలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. దేశ రక్షణ, భద్రత కోసం భారత త్రివిధ దళాలు అందిస్తున్న సేవలపై చిన్నారులు, విద్యార్థులు, సందర్శలకు విజ్ఞానం, వినోదం పంచేందుకు ఎన్టీఆర్ బీచ్‌లో రెండెకరాల స్థలాన్ని కేటాయించారు. అక్టోబరు, 2020లో గోదావరి అర్బన్ డెవలప్‌మెంట్ సంస్థ (గుడా) రూ.5.89 కోట్ల నిధులతో టీయూ-142 ఎం యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బిల్లుల మంజూరులో జాప్యం, అసంపూర్తి నిర్మాణ పనుల కోసం రూ.9.03 కోట్లతో ఇతర చిల్డ్రన్స్ పార్కు, బ్యూటిఫికేషన్, విద్యుదీకరణ తదితర పనులు చేపట్టారు. యుద్ధ విమాన మ్యూజియం అసంపూర్తి నిర్మాణ పనులు పూర్తి చేయకుండానే ఎన్నికల ముందు జనవరి 2024లో వైసీపీ ప్రభుత్వం హడావుడిగా ప్రారంభించారు. మ్యూజియం చుట్టూ గ్రీనరీ, బ్యూటిఫికేషన్, చిన్నారుల పార్కు, విద్యుద్ధీకరణ తదితర నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో యుద్ధ విమాన మ్యూజియం సందర్శకులకు అందని ద్రాక్షలా మిగిలింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కృషితో కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, నగర పాలక సంస్థ కమిషనర్, కౌడా ఇన్‌చార్జి వీసీ భావన చొరవతో ఎట్టకేలకు పూర్తిస్థాయిలో యుద్ధ విమాన మ్యూజియం నిర్మాణ పనులు పూర్తి చేశారు. డిసెంబరు నెలాఖరు నాటికి దీన్ని సందర్శకులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రధాన ఆకర్షణగా మ్యూజియం

టీయూ-142 యుద్ధ విమానాన్ని రష్యా నుంచి కొనుగోలు చేశారు. కార్గిల్ యుద్ధంలో విశేష సేవ లు అందించింది. ప్రపంచంలోనే అతి భారీ, పురాతన యుద్ధ విమానాల్లో ఒకటైన టీయూ-142 ఎం ఎయిర్ క్రాఫ్ట్ భారత నావికాదళం వైమానిక విభాగంలో 28ఏళ్లపాటు దేశానికి సుదీర్ఘకాలం సేవలు అందించింది. సముద్ర తీరంలో గస్తీ, జలాంతర్గామి నిరోధక సేవలు అందించడంలో తరుపు ముక్కగా పేరు గాంచింది. ఇది 2017లో నేవీ నుంచి ఈ యుద్ధవిమానం తప్పుకుని తమిళనాడు అరక్కోణం బేసల్ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ రాజసంలో విశ్రాంతి తీసుకుంటుంది. ఒక్కసారి ఫ్యూయల్ నింపుకుని ప్రపంచ దేశాలను 16 గంటల్లో చుట్టి వచ్చే సామర్థ్యం దీని సొంతం. గంటకు 925 కిలో మీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. విమానం పొడవు, వెడల్పులు 50 మీటర్లు, రెక్కల పొడవు 50 మీటర్లు ఉంటుంది. దీని బరువు 90వేల కిలోలు ఉండడం విశేషం. ఈ పురాతన యుద్ధ విమానాన్ని తమిళనాడు నుంచి కాకినాడ బీచ్‌కు 14 భారీ వాహనాల ద్వారా తెనేజా ఏరోస్పేస్ లిమిడెట్ సంస్థ తీసుకువచ్చి మ్యూజియంలో పొందుపరిచింది. విమానంలోకి ప్రవేశించే ముందు లోపలనుంచి వివిధ పరికరాలు, విమాన భాగాలను తిలకించవచ్చు. సోనా బాయ్స్ ప్రొపెల్లర్, ఇంజన్, సర్వేకల్ కిట్, యాంటీ జలాంతర్గమి క్షిపణి, డేట్ రికార్డర్ పరికరాలు, విమానంలోనికి ఎక్కేందుకు ఫైట్ సిమ్యులేటర్ ప్లాట్‌ఫారం ఉంది. యుద్ధ సమయంలో విమానాలను వినియోగించే తీరు, ఆయుధాల నిల్వ, వాటిని ఏవిధంగా ప్రయోగిస్తారు. విమాన టేకాఫ్, దేశానికి అందించిన సేవలు వివరాలు తెలిపే ల్యాండింగ్ డిస్‌ప్లే, వీడియో, ఆడియో తదితర సమాచార వ్యవస్థ, గేమింగ్ జోన్, విజ్ఞానం అందించనున్నారు.



సిద్ధమైన పార్కు ప్రాంగణం



హెచ్‌పీటీ-32 ప్రైమరీ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్

పూర్తిస్థాయిలో మ్యూజియం రెడీ

యుద్ధ విమాన మ్యూజియం అసంపూర్తి నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాయి. విమానం లోపల విద్యుద్దీకరణ, ఏసీ పూర్తి చేశాం. ప్రాంగణంలో చిన్నారులకు వినోదం పంచేందుకు పచ్చదనంతోపాటు పార్కు అభివృద్ధి, సుందరీకరణ పనులు పూర్తయ్యాయి. ఎన్టీఆర్‌బీచ్ నుంచి యుద్ధ విమాన మ్యూజియానికి స్వాగతం పలికేలా స్వాగత ద్వారం ఏర్పాటు చేశాం. ప్రవేశ ద్వారం నుంచి విమాన మ్యూజియం వరకు ఇరువైపులా రహదారిని అందంగా తీర్చిదిద్దాం. అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేశాం. జిల్లా కలెక్టర్, కౌడా వీసీ, కమిషనర్ ఆదేశాల మేరకు ఈనెలాఖరుకు మ్యూజి యం ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటున్నాం.

-జి.శ్రీనివాస్, కౌడా ఏఈ, కాకినాడ

పచ్చదనం ఉట్టిపడేలా పార్కు

ఈ మ్యూజియం ప్రాంగణంలో చిన్నారుల కోసం ప్రత్యేకంగా పార్కు ఏర్పాటుచేశారు. చిన్నారులు, పెద్దలు, యువతను ఆకట్టుకునేలా పచ్చదనం, వివిధ రకాల వెజిటబుల్స్ పండ్లు, ఉడ్ కర్రలు అందంగా ఏర్పాటుచేశారు. చిన్నారుల పార్కులో 2009లో సర్వీసులో రిటైర్‌మెంట్ తీసుకున్న హెచ్‌పీటీ-32 విమానాన్ని ఏర్పాటు చేశారు. ఇది ప్రైమరీ ట్రైనర్ ఎయిర్‌క్రాఫ్ట్. పైలట్లకు శిక్షణ ఇచ్చే చిన్న విమానం. దీన్ని యుద్ధ విమాన మ్యూజియం ప్రాంగణంలో ఏర్పాటుచేశారు.





ఆలమూరు వద్ద గోదావరి విహరిస్తున్న అరుదైన బార్ హెడెడ్ గుస్ బాతులు

గోదావరిలో అరుదైన అతిథులు

- భూమికి మూడు వేల అడుగుల ఎత్తులో ఎగిరే పక్షులుగా గుర్తింపు
- హిమాలయాల నుంచి శీతాకాలంలో వచ్చే అరుదైన అతిథులు
- కోనసీమ జిల్లాలోని ఆలమూరు వద్ద గోదావరిలో పక్షుల సందడి

ఆలమూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): భూమికి అత్యంత ఎత్తులో ప్రయాణించే పక్షులుగా గుర్తింపు పొందిన బార్‌హెడెడ్ గుస్ బాతులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆలమూరు వద్ద గోదావరి తీరాన సందడి చేశాయి. హిమాలయ పర్వత ప్రాంతాల నుంచి శీతాకాలంలో వచ్చే అరుదైన పక్షులుగా ఈ బాతులకు మంచి గుర్తింపు ఉంది. భూమికి సుమారు 3 వేల అడుగుల ఎత్తులో ఎగరడం వీటి ప్రత్యేకత. శీతాకాలంలో కోసిన వరిపొలాలు, చిత్తడి నేలలు వీటికి ఆవాస క్షేత్రాలుగా విలసిల్లుతాయని ప్రముఖ వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఉప్పులూరి సురేష్‌కుమార్ తెలిపారు. రోజుకు వందల కిలోమీటర్ల మేర ప్రయాణం చేయడం వీటి ప్రత్యేకత. సాధారణంగా నవంబరులో రావాల్సిన ఈ పక్షులు ఈసారి ఆలస్యంగా డిసెంబరు నెలలో కనిపించినట్టు వివరించారు. ఉప్పునీటి కయ్యలు, మంచినీటి కయ్యలు, నదీతీరాలకు వీటి రాక ఉంటుందని.... అయితే ఆలమూరు మండలంలో ఇవి కనిపించడం ఆనందం కలిగించే విషయమని చెప్పారు.

ప్రపంచ తెలుగు రచయితల మహాసభకు 'తరపట్ల'



సత్యనారాయణ (పాత చిత్రం)

దివాన్‌చెరువు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 28, 29 తేదీల్లో జరిగే 6వ ప్రపంచ తెలుగు రచయితల సభలకు తాను విశిష్ట అతిథిగా హాజరవుతున్నానని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ సహాయ ఆచార్యుడు తరపట్ల సత్యనారాయణ గురువారం తెలిపారు. విద్యారంగ ప్రతినిధుల సభలో పాల్గొని 'కనుమరుగవుతున్న మన జానపద కళా సంపద పరిరక్షణ-ప్రణాళికలు' అంశంపై ప్రసంగిస్తానని చెప్పారు. ప్రపంచ వేదికలపై మనగొంతు వినిపించాలని, అదొక గొప్ప సందేశం కాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. తరపట్లకు నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉప కులపతి ఆచార్య శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతిర్మయి అభినందనలు తెలిపారు.



ఒడిశా రైతులకు మొక్కల గురించి వివరిస్తున్న ఉద్యానవన శాఖ అధికారి సుధీర్‌కుమార్

పూల పరిశోధనా కేంద్రాన్ని సందర్శించిన ఒడిశా రైతులు

కడియం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం వేమగిరిలోని పూల పరిశోధనా ప్రాంతీయ కేంద్రాన్ని గురువారం ఒడిశా రాష్ట్రం గంజాం రైతులు సందర్శించారు. పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డీవీఎస్ రాజు పూల సాగు ప్రాధాన్యం, పూల పంటల్లో ఆశించే తెగుళ్ల, చీడపీడలు వాటి నివారణ, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఫ్లోరికల్చర్ రీసెర్చ్ కేంద్రం శాస్త్రవేత్త మాధవన్ పూలమొక్కల్లో వచ్చే తెగుళ్ల, వాటి నివారణను వివరించారు. అనంతరం రైతుల బృందం కడియపులంక మల్లు పోలరాజు, గంగుమళ్ల సత్యనారాయణ నర్సరీలను సందర్శించింది. కడియం నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు, రైతుల కృషి, నర్సరీల అభివృద్ధి తదితర విషయాలను రైతులు వివరించారు. కార్యక్రమంలో మల్లు పోలరాజు, గంగుమళ్ల తాతాజీ, ఉద్యానవన శాఖ అధికారి డి.సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలకు ఆర్థిక పరిపుష్టి కల్పిస్తాం

కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్

గొల్లప్రోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలను ఆర్థికంగా పరిపుష్టి చేయడంతో పాటు రైతులకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టీ శ్రీనివాస్ వెల్లడించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణంలోని విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ) ఆవరణలో గురువారం రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార సంఘాల పనితీరు, వాటి బలోపేతానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలి, రైతుల అవసరాల ఏమిటి తదితర విషయాలు తెలుసుకుని తదనుగుణంగా బలోపేతం చేసేందుకు ఉద్యోగులు, రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అవసరం మేరకు వివిధ రంగాల్లో నూతన సొసైటీలు ఏర్పాటు చేస్తామన్నారు. సహకార వ్యవస్థను బలోపేతం చేసి అన్ని రంగాల్లోకి విస్తరించేలా రాష్ట్రాల సహకారంతో కేంద్రం చర్యలు చేపడుతోందని చెప్పారు. సమావేశంలో డీసీసీబీ పిఠాపురం బ్రాంచి మేనేజరు మహేష్, సూపర్‌వైజరు గోవిందు, సొసైటీ సీఈవో సూరిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

బీచ్ వాలీబాల్ పోటీలకు సర్వం సిద్ధం

ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో నేటి నుంచి మహిళా నేషనల్ ఇన్విటేషన్ బీచ్ వాలీబాల్ టోర్నమెంటు

నిబంధనల మేరకు ఫ్లడ్ లైట్ల వెలుగులో డే అండ్ నైట్ మ్యాచ్‌లు... ప్రారంభోత్సవానికి హాజరుకానున్న రాష్ట్ర మంత్రులు

ఎనిమిది రాష్ట్రాల క్రీడాకారిణులు రాక

తీరంలో 20 మంది గజ ఈతగాళ్లు

ఉప్పలగుప్తం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో ఈ నెల 27 నుంచి 29 వరకు డే అండ్ నైట్ నేషనల్‌ఇన్విటేషన్ మహిళా బీచ్ వాలీబాల్ పోటీలకు క్రీడా ప్రాంగణాన్ని సిద్ధం చేశారు. ఎస్.యానాంలో టూరిజం ప్రాజెక్టును అభివృద్ధి చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చే ప్రయత్నంలో భాగంగా బీచ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు వాలీబాల్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో డై అండ్ నైట్ మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. శుక్రవారం ప్రారంభోత్సవానికి పలువురు రాష్ట్ర మంత్రులు హాజరవుతారని తెలిపారు. అమలాపురం డీఎస్పీటీ ఎస్ఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ చలమల రాజేష్ క్రీడా ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లపై గురువారం ఎమ్మెల్యేతో చర్చించారు. క్రీడా ప్రాంగణంలో టెక్నికల్ టీమ్‌కు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. సముద్ర తీరాన 20 మంది గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుతామని వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పలచోళ్ల పద్మనాభం వివరించారు. టోర్నీని తిలకించేందుకు వచ్చే క్రీడాభిమానులకు అనుగుణంగాభద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం కీలక ప్రదేశాల్లో పోలీసులను నియమిస్తామన్నారు.

ఎస్.యానాం బీచ్‌కు చేరుకోవచ్చు ఇలా..

అమలాపురం, రాజమహేంద్రవరం వైపుల నుంచి వచ్చే క్రీడాభిమానులు అమలాపురం నుంచి నేరుగా ఎస్.యానాం బీచ్‌కు రావచ్చు. కాకినాడ నుంచి వచ్చేవారు పల్లంకుర్రు రూట్లో కాట్రేనికోన నుంచి ఆర్అండ్‌బీ రహదారిలో నేరుగా ఎస్.యానాం రావచ్చు. ప్రధాన గ్రామం నుంచి బీచ్ వరకు మూడు కిలో మీటర్ల మేర సీసీ రహదారి వేశారు.



ఎస్.యానాం సముద్ర తీరాన నేషనల్ బీచ్ వాలీబాల్ పోటీలకు సిద్ధమైన క్రీడా ప్రాంగణం, సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, టెక్నికల్ టీమ్



లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు

ప్రతిరోజు ఆరు మ్యాచ్‌లు నిర్వహిస్తాం

గొలకోటి ఫణీంద్రకుమార్, వాలీబాల్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి, ఫిజికల్ డైరెక్టర్

ఆంధ్రప్రదేశ్, గుజరాత్, గోవా, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, బెంగాల్, వేల్స్ యూనివర్సిటీ మహిళా జట్లు టోర్నమెంటులో పాల్గొంటున్నాయి. ప్రతిరోజూ ఆరు మ్యాచ్‌లు జరిగేలా ఏర్పాట్లు చేశాం. లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగుతాయి. టెక్నికల్ టీమ్ సహకారంతో క్రీడా ప్రాంగణాన్ని అధునాతన విధానంలో సిద్ధం చేశాము. క్రీడాభిమానులు కూర్చుని చూసేందుకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశాము.







బాటిల్‌తో చేపల వేటలో పాల్గొన్న మత్స్యకార యువకులు, తిలకిస్తున్న జనం.. చిక్కిన చేపలు

బాటిల్‌తో చేపల వేట!

- గోదావరిలో భారీగా చిక్కుతున్న చేపలు
- వైరల్ అవుతున్న వీడియోలు

యానాం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): చేపల వేటలో యానాంకు చెందిన మత్స్యకార యువకులు కొత్త ఒరవడ సృష్టిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తూర్పుగోదావరి జిల్లాలో అంతర్ భూభాగంగా ఉన్న కేంద్రపాలితప్రాంతమైన యానాం పర్యాటకంగా ప్రసిద్ధి చెందింది. ఇక్కడ గోదావరి కలిసే సముద్ర ముఖద్వారం కావడంతో అరుదైన మత్య సం పద దొరుకుతుంది. ఈ సంపద యానాం మత్స్యకారులు వేటకు చిక్కడంతో వాటిని మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ముఖ్యంగా మత్స్యకారులు చేపల వేటలను వివిధ రకాల వలలు, గేలాల ద్వారా చేస్తుంటారు. అయితే ప్రస్తుతం యానాం మత్స్యకార యువకులు చేపలు పట్టడంతో కొత్త ఒరవడి అనుసరిస్తున్నారు. యానాం కనకాలపేట సమీపంలోని పుష్కర్ ఘాట్ వద్ద గల గోదావరిలో ఎప్పటిలా కాకుండా నూతన నిధానంలో చేపల వేట నిర్వహించారు. ఒక లీటర్ వాటర్, డ్రింక్ బాటిల్‌ను సగానికి కట్‌చేసి వాటికి నాలుగు వైపులా తాడుకట్టి వాటిలో మైదా పిండివేసి గోదావరిలోకి విసురుతున్నారు. బాటిల్‌లోని మైదాపిండి తినేందుకు వచ్చిన చేప (కొయ్యింగ మాత్రమే) వాటిలో ఇరుక్కుపోతోంది. వాటిని పైకి లాగుతారు. గత మూడు రోజులుగా ఈ వేట కొనసాగుతోంది. లైవ్‌ఫిష్ దొరుకుతున్నాయని ఆనోటా ఈనోట తెలియడంతో సందర్శకుల తాడికి ఎక్కువైంది. కొందరు కొనుగోలు చేసుకుని ఇంటికి పట్టుకెళ్తున్నారు.

రహదారి భద్రతపై ప్రజా చైతన్య యాత్ర

దివాన్‌చెరువు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాహనాలపై ప్రయాణించే సందర్భంలో భద్రత చాలా ముఖ్యమని, ఈ విషయంలో ప్రజలను చైతన్యం చేసేందుకు తాము యాత్రసాగిస్తున్నామని హైదరాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నరేష్ తెలిపాడు. హైదరాబాద్‌కు చెందిన ఒక డాక్టర్, ఒక ఫార్మాసిస్ట్, మరో ముగ్గురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు చేపట్టిన బైక్ యాత్ర గురువారం తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువు చేరింది. డాక్టర్ వెంకట్ కోసూరి, డాక్టర్ పిన్నింటి నరేష్, బి.వంశీ, కరణం కృష్ణచైతన్య, బాలాంత్రపు శ్రీకృష్ణ, డేనియల్ బెన్ విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో యాత్ర ప్రారంభించామని... మచిలీపట్నం, దిండి, యానాం, కాకినాడ, భీమవరం, బాపట్ల మీదుగా హైదరాబాద్ చేరుకుంటామన్నారు. యాత్ర తొమ్మిది రోజులు సాగుతుందన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్, గ్లౌజ్‌లు, జాకెట్ ధరించడం వల్ల ప్రమాదం జరిగినా స్వల్ప గాయాలతో బయటపడవచ్చన్నారు. ఏపీలోని అందాలను తమ హెల్మెట్లలో అమర్చిన కెమెరాల్లో రికార్డు చేసి ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ ద్వారా ప్రజలకు చూపిస్తామని వివరించారు.



బైక్ యాత్ర బృందం సభ్యులు

పుంగనూరు దూడ.. అడుగున్నరే..



పి.గన్నవరం,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం లంకలగన్నవరంలో జెర్సీ పుంగనూరు ఆవు అడుగున్నర ఎత్తుతో పుంగనూరు జాతి దూడకు జన్మనిచ్చింది. ఈ దూడ ఎత్తు, పొడవు తక్కువగా ఉండడంతోపాటు బూడిద రంగులో ఉండడంతో స్థానికులు ఆ సక్తిగా తిలకిస్తున్నారు. ఇది టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబుకు సంబంధించినపశువులశాలలో జన్మించింది.

ఫిబ్రవరి 4 నుంచి 13 వరకు..

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దివ్య కల్యాణోత్సవాలు



ముహూర్తపు పత్రాన్ని ఆలయ ఏసీకి అందిస్తున్న అర్చకులు

- 7వ తేదీ శుక్రవారం రాత్రి 12.55 గంటలకు సుముహూర్తం

అంతర్వేది, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పుణ్యక్షేత్రంలో శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు అర్చకులు ముహూర్తం ఖరారు చేశారు. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి 13 వరకు స్వామివారి వార్షిక కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సుముహూర్తం నిర్ణయించి ముహూర్తపు పత్రికను ఆలయ స్థానాచార్యులు, అర్చక, వేదపండితులు ఏసీ సత్యనారాయణకు గురువారం అందించారు. ఫిబ్రవరి 7వ తేదీ శుక్రవారం రాత్రి 12.55 గంటలకు స్వామివారి కల్యాణం, 8వతేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి రథోత్సవం, 12వతేదీ బుధవారం 8 గంటలకు స్వామివారి చక్రస్నానం(సముద్రస్నానం), 13వతేదీ సాయంత్రం 6 గంటలకు తెప్పోత్సవం జరుగుతాయి. పది రోజులపాటు స్వామివారికి గ్రామోత్సవాలు(వాహనసేవ) నిర్వహిస్తారు. ఇప్పటికే ఉత్సవాల టెండర్లు ఖరారై సమీక్షా సమావేశాన్ని అమలాపురం ఆర్డీవో అధ్యక్షతన జనవరి 2వ తేదీ ఉదయం 11 గంటలకు అంతర్వేది ఆలయంలో ఏర్పాటు చేసినట్టు ఏసీ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్యులు రంగాచార్యులు, సూపరింటెండెంట్ పి.విజయసారథి, కిరణ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో టీడీపీ నేత మృతి

- పాడె మోసిన గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి



సాగిపాడులో టీడీపీ నేత పాడె మోస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతిచెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సోమరాజు పాడెను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మోశారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజక వర్గం సాగిపాడుకు చెందిన టీడీపీ నేత పంది సోమరాజు(70) గురువారం స్వగృహంలో గుండెపోటుతో మృతిచెందారు. ఆయన పార్టీ మండల ఉపాధ్యక్షుడిగా, గ్రామ కమిటీ అధ్యక్షుడిగా, బీసీ నేతగా పనిచేశారు. ఆయన పార్థీవదేహానికి ఎమ్మెల్యే మద్దిపాటి టీడీపీ జెండా కప్పి నివాళులర్పించి పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ వారి కుటుంబానికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో కొర్లపాటి రాము, జగదీష్, జ్యేష్ట శ్రీనివాసరావు,రమేష్, వేముల నాగరాజు, బండారు గనిరాజు, శ్రీధర్, మోహనరావు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని

భర్తపై భార్య ఫిర్యాదు

కేసు నమోదు చేసిన పోలీసులు

ఆత్రేయపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నంకోసం తన భర్త వేధిస్తున్నాడని ఓ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేశారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలేనికి చెందిన కాయల సునీతకు 2021లో అదే గ్రామానికి చెందిన కాయల అనిల్‌కుమార్‌తో ప్రేమవివాహం జరిగింది. వీరికి మూడేళ్ల బాలుడు ఉన్నాడు. సునీత గ్రామ సచివాలయంలో వ్యవసాయ సహాయకురాలిగా పనిచేస్తోంది. భర్త కరెంట్ పనులు చేస్తుంటాడు. మద్యానికి బానిసై అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

ప్రజల భాగస్వామ్యంతో నేరాల కట్టడికి చర్యలు

- డ్రోన్ టెక్నాలజీతో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం
- ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్
- కాకినాడ జిల్లాలో పోలీస్‌స్టేషన్ల తనిఖీ



పెద్దాపురం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఐజీ అశోక్‌కుమార్

పెద్దాపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన కాకినాడ జిల్లా పెద్దాపురం డీఎస్పీ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఐజీ మీడియాతో మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే నేరాల కట్టడి సాధ్యమవుతుందన్నారు. ప్రజలు ఇంటి పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరస్తులను సులువుగా గుర్తించవచ్చన్నారు. ఈ విషయంలో ప్రజలకు మరింత అవగాహన కల్పిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యక లాపాలకు పాల్పడేవారిని గుర్తించేందుకు డ్రోన్ టెక్నాలజీ వినియోగించనున్నట్టు చెప్పారు. గంజాయి నిర్మూలన విషయంలో పలు బృందాలతో ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. రికార్డులను తనిఖీ చేసి వార్షిక పురోగతిపై ఆరా తీశారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్, డీఎస్పీ డి.శ్రీహరిరాజు, సీఐలు క్రాంతికుమార్, ఎ.కృష్ణభగవాన్, పెద్దాపురం ఎస్‌ఐ మౌనిక పాల్గొన్నారు.

సైబర్ క్రైంపై ప్రత్యేక దృష్టి: ఐజీ

సర్పవరంజంక్షన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టుల పేరు భయభ్రాంతులకు గురి చేస్తున్న సైబర్ నేరగాళ్లపై ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఈ తరహా సంఘటనలు జరిగితే తక్షణం 1930 టోల్‌ఫ్రీ నెంబరుకు కాల్ చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం ఆయన కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి కాకినాడ రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఐజీ విలేకరులతో మాట్లాడుతూ సైబర్ క్రైం నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వ్యక్తిగత తగాదాల నేపథ్యంలో గొల్లపాలెం మండలం శలపాక, సామర్లకోట మండలం వేట్లపాలెంలో హత్యలు జరిగాయని తెలిపారు. శాంతి భద్రత పరిరక్షణకు చిన్న తగాదాలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి త్వరగా శిక్షపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



కాకినాడ రూరల్ సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఐజీ

'అన్నవరం'లో మార్పులపై ఈవో, చైర్మన్ సమీక్ష

అన్నవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో లోటుపాట్ల సవరణపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ సిబ్బందితో ప్రకాశ్‌సదన్ సమావేశమందిరంలో సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా సత్రం గదులు ముందస్తు రిజర్వేషన్ చేసుకున్న భక్తుడికోసం 24గంటలపాటు అతనికి గది కేటాయించాలనే ఉద్దేశ్యంతో ఖాళీగా ఉంచడంతో తర్వాత వచ్చిన భక్తుడికి కేటాయించలేకపోతున్నారు. దీంతో చెక్‌ఇన్, చెక్ అవుట్ సమయం విధిగా రిజర్వేషన్ సమయంలో ఇవ్వాలని సలహాఇచ్చారు. దేవస్థానంలో నగదు రహిత సేవలు లేనందున భక్తులు పడుతున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ముందుగా ఒక ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి డిజిటల్ పేమెంట్ ద్వారా వ్రతం టిక్కెట్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈవో, మరికొందరి సిబ్బంది పరిచయ కార్యక్రమం జరిగింది. ఏఈవోలు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

రత్నగిరి వ్రత మండపంలో భక్తుడికి తీవ్ర అస్వస్థత

అన్నవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన ఒక భక్తుడు గురువారం ఒక్కసారిగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో ఆందోళన నెలకొంది. విజయవాడకు చెందిన ఏఎస్ ప్రసాద్ కుటుంబసభ్యులతో స్వామిసన్నిధికి విచ్చేసి గురువారం రూ.1500 వ్రతమండపం వద్దకు చేరుకున్నాడు. వ్రతం ప్రారంభం కాకుండానే పక్షవాతం వచ్చి బీపీ పెరిగింది. వెంటనే సిబ్బంది 108అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చినా రాకపోవడంతో ప్రాథమిక చికిత్స చేసి సొంతవాహనంలో దేవస్థానం ఆస్పత్రికి తరలించారు. వైద్యాధికారి చికిత్స చేయడంతో ఆయన కుదుటపడ్డాడు.

బాలికతో అసభ్య ప్రవర్తన

పాస్టర్‌పై పోక్సో కేసు

కొవ్వూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించిన పాస్టర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు సీఐ పి.విశ్వం తెలిపారు. తూర్పుగోదావరిజిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామానికి చెందిన పాస్టర్ దేవదాసు కుటుంబరావు ఈనెల 25వతేదీ ఉదయం మండలంలోని ఓ గ్రామంలోని ఓ ఇంట్లోకి ఎవరూ లేని సమయంలో వెళ్లాడు. 11ఏళ్ల బాలికను.. సాయంత్రం క్రిస్మస్ పార్టీకి వస్తామనిచెప్తూ బలవంతంగా కౌగిలించుకుని, పలుచోట్ల చెయ్యి వేసి ముద్దు పెట్టుకున్నాడు. బాలిక తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేయడంతో కుటుంబసభ్యు లు కొవ్వూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడి మృతి

కొత్తపేట మండలంలో ఘటన

కొత్త పేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కొత్తపేటమండలంలో చెట్టుపైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. కొత్తపేట మండల పరిధి బిళ్లకుర్రు గ్రామశివారు నల్లావారిపేటకు చెందిన గీత కార్మికుడు బండి వెంకటరామారావు(58) గురువారం తనతండ్రి పొలంలో తాటిచెట్టు ఎక్కి గీతకు సిద్ధం చేస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తూ కాలుజారి కింద ఉన్న సిమెంట్ స్తంభంపై నేరుగా పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపేట ఏఎస్‌ఐ జీవీ కృష్ణారావు తెలిపారు.

శునకాలు అడ్డు రావడంతో.. ఆటో బోల్తా

- ఒకరి మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు
- కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలో ఘటన



గంటిపెదపూడిలో ఆటో బోల్తా ఘటనలో మృతి చెందిన పల్లయ్య



గాయాలపాలైన వీరవేణి

పి.గన్నవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం గంటిపెదపూడిలో ప్రధాన రహదారిపై కుక్కలు అడ్డు రావడంతో ప్యాసింజర్ ఆటో అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పి.గన్నవరం మండలం వైవీ పాలెం గ్రామానికి చాగంటి సతీష్ తన ప్యాసింజర్ ఆటోతో పి.గన్నవరం గంటిరోడ్డులోని వార్ఫు సెంటర్ నుంచి రావులపాలెం బయలుదేరాడు. ఈ క్రమంలో గంటిపెదపూడి సెంటర్ సమీపంలోకి వెళ్లేసరికి ఎదురుగా రెండు కుక్కలు చెలగాటం ఆడుతూ ఒక్కసారిగా ఆటోకు అడ్డుగా వచ్చాయి. దీంతో ఆటోను డ్రైవర్ అదుపు చేయలేకపోవడంతో రోడ్డుపై బోల్తా కొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తోపాటు మరో ఐదుగురిలో ముమ్మిడివరం మండలం కో మానపల్లి గ్రామానికి చెందిన సవరపు పల్లయ్య(61)కు బలమైన గాయంకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ సతీష్, ప్రయాణికురాలు వై.కొత్తపల్లి గ్రామానికి చెందిన వెల్ల వీరవేణికి గాయాలు కావడంతో 108 అంబులెన్స్ సాయంతో పి.గన్నవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వారిని అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మరో ఇద్దరు మహిళలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కొమ్ముబూర ఊదే పల్లయ్యది స్వగ్రామం కోమానపల్లి కాగా ఉడిమూడి సెంటర్‌లో ఆటో ఎక్కాడని తోటిప్రయాణికులు చెప్తున్నారు. కాకినాడలో ఉన్న పల్లయ్య బంధువులకు పోలీసులు సమాచారం అందించి మృతదేహాన్ని రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు.

చెట్టును ఢీకొన్న ద్విచక్ర వాహనం

- ఇద్దరు గిరిజన యువకులు మృతి
- కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో ఘటన



సంఘటనాస్థలంలో మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్‌ఐ



సుబ్రహ్మణ్యం(ఫైల్)



వెంకటరమణ

శంఖవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి సమయంలో టిఫిన్ చేసేందుకు బయటకు వెళ్లిన గిరిజన యువకులు చీకట్లో వేగంగా ద్విచక్రవాహనంతో చెట్టును ఢీకొన్నారు. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. కాకినాడ జిల్లా శంఖవరం మండలంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి అన్నవరం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

శంఖవరం మండలం పెదమల్లాపురం గ్రామానికి చెందిన బోడోజు వెంకటరమణ(18), బలుం సుబ్రహ్మణ్యం(24) పక్క గ్రామమైన వేలంగిలో టిఫిన్ చేసేందుకు బుధవారం రాత్రి సమయంలో బండిపై వెళ్లారు. అక్కడ పని పూర్తి చేసుకుని తిరిగి బైక్‌పై వేగంగా వస్తున్నారు. ఆమార్గంలో ఓచోట చెట్టును బలంగా ఢీకొట్టడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. రాత్రివేళలో అటుగా రాకపోకలు తక్కువగాఉండడంవల్ల ఎవరూ ప్రమాదాన్ని వెంటనే గుర్తించలేదు. రాత్రి 11గంటల సమయంలో అటుగా వెళ్తున్న గ్రామస్థులు సంఘటనా స్థలంలో ఇద్దరు యువకులు విగతజీవులుగా ఉండడం గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కానీ అప్పటికే వారు మరణించినట్లు ధ్రువీకరించారు. గిరిజన యువకుల మరణంతో కుటుంబీకులు బోరున విలపించారు. సంఘటనాస్థలాన్ని అన్నవరం ఎస్‌ఐ శ్రీహరిబాబు పరిశీలించి మృతదేహాలను తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శించారు. ప్రమాదానికిగల కారణాలను రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు బచ్చల గంగను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

ఏజెంట్ మోసం... గల్ఫ్‌లో నరకం

- కూటమి ప్రభుత్వం సహకారంతో మస్కట్‌నుంచి వచ్చిన మహిళ
- బాధితురాలిది కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు

తాళ్లరేవు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లిన ఆ మహిళ.. ఏజెంట్ చేతిలో మోసపోయి అక్కడ దుర్భర పరిస్థితి ఎదుర్కొంది. ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా పైస్థాయికి వెళ్లడంతో కూటమి ప్రభుత్వ సహకారంతో ఆమెను తిరిగి స్వస్థలానికి తీసుకువచ్చారు.

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట గ్రామానికి చెందిన వాసంశెట్టి పద్మ 9నెలల క్రితం మస్కట్ దేశానికి వెళ్లింది. ఏజెంట్ సరైన వీసా ఇవ్వకపోవడం.. పాస్‌పోర్టు సరిగ్గా లేకపోవడంతో ఆమెకు పనిచేసే అవకాశం లేకుండా పోయింది. తినడానికి తిండి, ఉండడానికి నీడ దొరకని తీవ్ర ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. ఆమె తన దీనస్థితిని తెలియజేస్తూ తనను రక్షించాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను వేడుకుంటూ ఒక వీడియో విడుదల చేసింది. దీన్ని స్థానిక టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్, ఆ పార్టీ నేత జక్కల ప్రసాద్ గమనించి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ దృష్టికి తీసుకెళ్లారు.వారి సహకారంతో సీఎం, డిప్యూటీ సీఎంతోపాటు మంత్రి లోకేశ్‌లకు చేరేలా సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. ఈ ప్రయత్నం ఫలించి ప్రభుత్వ పెద్దలు మస్కట్‌లో ఉన్న భారత రాయబారులను సంప్రదించారు. ఆమెను రక్షించే బాధ్యతను వారికి అప్పగించారు. దీంతో ఆమె ఈనెల 24న మస్కట్ నుంచి తాళ్లరేవులోని తన నివాసానికి చేరుకుని కుటుంబసభ్యులను కలుసుకుంది. తనకు సహకరించిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపింది.



వాసంశెట్టి పద్మ

పది కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరి రాజు

ఏలేశ్వరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శ్రీహరి రాజు తెలిపారు. గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలేశ్వరం మండలంలోని యర్రవరం జాతీయ రహదారిపై కర్ణాటకకు చెందిన కారులో గంజాయి తరలిస్తున్నారన్న సమాచారంతో కారును తనిఖీ చేశారు. అందులో పది కిలోల గంజాయిని, నాయజ్ షాషా(41) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని సీజ్ చేసి సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దీనివిలువ రూ.60వేలు ఉంటుందన్నారు. సీఐ సూర్యఅప్పారావు, ఎస్‌ఐ రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

పాడుబడిన థియేటర్ పైనుంచి పడి..

గుర్తు తెలియని యువకుడి మృతి

- అమలాపురంలో ఘటన

అమలాపురం టౌన్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎక్కడి నుంచి వచ్చాడో.. ఎలా వెళ్లాడో తెలియదు గానీ.. దశాబ్దాల కాలం క్రితం అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లిలో మూసివేసిన హనుమాన్ థియేటర్‌లోకి గురువారం గుర్తు తెలియని యువకుడు వెళ్లాడు. శిథిలావస్థలో ఉన్న భవనంపైకి చేరుకుని అక్కడినుంచి పడిపోయాడు. అతడిని 108 అంబులెన్సులో అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందినట్టు పట్టణ ఎస్‌ఐ కిశోర్‌బాబు తెలిపారు. ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గుర్తు తెలియని యువకుడి సమాచారం కోసం సామాజిక మాధ్యమాలతోపాటు ఇతర జిల్లాల అధికారులకు సమాచారం అందించినట్టు అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.



ఏరియా ఆస్పత్రిలో మృతి చెందిన యువకుడు

కాలువలో పడి బాలుడి మృతి

- తూర్పుగోదావరి జిల్లా బల్లిపాడులో విషాదం



చిన్నారి అద్విత్ మృతదేహం

తాళ్లపూడి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలువలో పడి ఓ బాలుడు మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలంలోని బల్లిపాడు గ్రామంలో కాలువ గట్టును ఆనుకుని ఉండే ఎస్సీ కాలనీలో నివసించే తలపాకుల ఝాన్సీ రాణికి ముగ్గురు సంతానం. చిన్నవాడైన తలపాకుల అద్వితకుమార్(4) అంగన్‌వాడీ సెంటర్‌నుంచి సాయంత్రం 4గంటలకు ఇంటికి వచ్చాడు. తర్వాత ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో పడి మునిగిపోయి మృతి చెందాడని తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. తన భర్త కరోనా సమయంలో మృతి చెందగా ఇప్పుడు చిన్నకుమారుడు చనిపోయాడని ఆమె కన్నీరుమున్నీరవుతోంది. బాలుడి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

నూకాంబికా అమ్మవారికి.. వెండి ఆభరణాల బహూకరణ



వెండి ఆభరణాలతో నూకాంబికా అమ్మవారు

ఆలమూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబికా అమ్మవారికి భక్తుల సహకారంతో రూ.40లక్షల విలువైన వెండి ఆభరణాలు బహూకరించారు. ముందుగా భక్తులు అమ్మ వారికి 25కిలలో వెండితో తయారు చేయించిన ఆభరణాలకు గురువారం భారీ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహానికి అలంకరించారు. వెం డి ఆభరణాలను ఆలయ ఈవో వీర్రాజుకు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అందించారు.

ఆటోను తప్పించబోయి వంతెనపైనుంచి

పడిపోయిన యువకుడు

- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- పండక్కి దుస్తులు కొనుక్కొనేందుకు ద్వారపూడి వెళ్తుండగా ఘటన



ప్రేమ్‌కుమార్ మృతదేహం

మండపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు బట్టలు కొనుక్కునేందుకు స్నేహితుడి మోటారుసైకిల్‌పై వెళ్తూ ఓ యువకుడు ప్రమాదవశాత్తూ వంతెనపైనుంచి కిందపడి గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది. కోనసీమ జిల్లా మండపేట రూరల్ పోలీసులు కథనం ప్రకారం.. మండపేట మండలం కేశవరం గ్రామానికి చెందిన గానుగుల ప్రేమ్‌కుమార్(17) గురువారం పండక్కి బట్టలు కొనుక్కునేందుకు స్నేహితుడి వద్ద బైక్‌తీసుకుని బయలుదేరాడు. ద్వారపూడి ఫ్లైఓవర్ వంతెనపై ఆటోను తప్పించబోయి ప్రమాదవశాత్తూ వంతెనపైనుంచి కిందకు పడిపోగా బైక్ వంతెనపై ఉండిపోయింది. ప్రేమ్‌కుమార్‌ను ద్వారపూడి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం మండపేట ప్రభుత్వాస్పత్రికి.. అక్కడినుంచి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ప్రేమ్‌కుమార్ తండ్రి చాలాకాలం క్రితం మృతి చెందాడు. తల్లి గంగాభవాని వద్ద కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

త్వరలో సెంటినరీ ఆంధ్ర బాప్టిస్ట్ ఆలయ శతాబ్ది ఉత్సవాలు

కాకినాడ సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం అందించే దిశగా పేద, బడుగువర్గాల సంక్షేమానికి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, త్వరలో సెంటినరీ ఆంధ్ర బాప్టిస్ట్ ఆలయ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నామని చర్చి పాస్టర్ భాస్కర్ గేర్షోమ్, ఆంధ్రా బాప్టిస్ట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రెయ్య రాజ్‌కుమార్, గొల్లమందల రాజేష్, కోశాధికారి వేమగిరి ఐజాక్ ప్రభాకర్ వెల్లడించారు. గురువారం కాకినాడ ఎల్విన్‌పేటలోని చర్చి ప్రాంగణలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ చర్చిని 1924లో కెనడియన్ బాప్టిస్ట్ మిషనరీస్ జాన్ క్రేగ్ స్థాపించారన్నారు. శతాబ్ది ఉత్సవాలకు సీనియర్ పాస్టర్ జెఫన్యా పీటర్ ముఖ్య ప్రసంగికులుగా విచ్చేయనున్నారన్నారు. సమావేశంలో సంఘ సభ్యుడు శివకుమార్ పాల్గొన్నారు.



వేణుగోపాల స్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకుడు, తిలకిస్తున్న మహిళలు

కనుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణం

పిఠాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి మాస కల్యాణం గురువారం కనుల పండువగా జరిగింది. వార్షిక ధనుర్మాస వేడుకల్లో భాగంగా జరిగిన కల్యాణోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, లగ్నాష్టక మహా సంకల్పం అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మాంగల్య ధారణ జరిగింది. యూకేకి చెందిన అప్పరీ మనోహర్-క్రాంతి దంపతుల సహకారంతో కల్యాణోత్సవాన్ని అర్చకుడు పి.విజయజనార్దనాచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఈవో నున్న శ్రీరాములు, ఆలయ అభివృద్ధి సేవా సమితి అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న దృశ్యం

'పద్మశాలీ కల్యాణ మండపం నిర్మాణానికి కృషి'

కాకినాడ సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలో పద్మశాలీలకు కేటాయించిన స్థలంలో అందరి సహకారంతో త్వరలోనే కల్యాణ మండపం నిర్మాణానికి కృషి చేస్తానని కాకినాడ నగర పద్మశాలీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు వింజమూరి వెంకట సుబ్బారావు (చినబాబు) పేర్కొన్నారు. రాజాట్యాంక్ ఆవరణలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం పద్మశాలీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం పూర్వ అధ్యక్షుడు పొన్నగంటి సత్యనారాయణ అధ్యక్షతన గురువారం జరిగింది. అధ్యక్షుడిగా వింజమూరి చినబాబు, కార్యదర్శిగా కొల్లు వెంకటేశ్వరరావు, కోశాధికారిగా వల్లభదాసు శివాజీగణేష్ ప్రమాణం చేశారు. సమన్వయ కమిటీ సభ్యులుగా జాగు రామకృష్ణ, పప్పు దుర్గారమేష్ వ్యవహరించారు. 20మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. కార్యక్రమంలో జగ్గారపు మల్లికార్జున్, చిల్లపల్లి గణపతి, పలివెల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నీటి సంఘాల ప్రతినిధులను సత్కరించిన దృశ్యం

నీటి సంఘాల ప్రతినిధులకు సత్కారం

తాళ్లరేవు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రబీ పంటకు సాగునీటి ఇబ్బంది తలెత్తకుండా నీటి సంఘాలు సామాజిక బాధ్యత చేపట్టాలని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వేగేశ్న భాస్కరరాజు కోరారు. గురువారం తాళ్లరేవు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయ ఆవరణలో ఇరిగేషన్ ఈఈ రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఆరు నీటి సంఘాల ప్రతినిధులను ఇరిగేషన్ అధికారులు సత్కరించారు. నీటి సంఘాల పరిధిలోని వర్కులకు ప్రతిపాదనలు, సమస్యలను స్వీకరించారు. సంఘాలు రైతులకు భరోసాగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఈ అనూష, డ్రైన్స్ డీఈ పోచారావు, ఏఈ వీరబాబు, సంఘాల చైర్మన్లు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

వంగవీటి రంగాకు నివాళి

పిఠాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉప్పాడ సెంటర్ వద్ద మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా చిత్రపటానికి వివిధ పార్టీల నాయకులు, రంగా అభిమానులు, రంగా మిత్ర మండలి సభ్యులు, యూత్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా అమర్ రహే అంటూ ప్రదర్శన జరిపారు.

బాధిత మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక సాయం

కాకినాడ సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో చేపల వేటకు వెళ్లి గల్లంతై కోస్ట్‌గార్డుల సాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేరిన బాధిత మత్స్యకార కుటుంబాలకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు. గురువారం జగన్నాథపురంలో ఎమ్మెల్యే నివాసానికి బాధితులు వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి తుమ్మల రమేష్, నాయకులు పాల్గొన్నారు.

46వ డివిజన్‌లో ప్రమాదవశాత్తు జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు ఎమ్మెల్యే కొండబాబు నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు, ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

'నవోదయ'లో చిత్రకళా ప్రదర్శన

పెద్దాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయలో వీరబాల దివస్‌ను పురస్కరించుకుని ఉపాధ్యా యులు ఎంపీ సింగ్, వీరాస్వామి ఆధ్వర్యంలో గురువారం చిత్ర కళా ప్రదర్శన నిర్వహించారు. బాలల్లో దేశభక్తి పెంపొందించే వీరగాథ కార్యక్రమంలో దీనిని ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ససపల సత్యనారాయణ పాల్గొన్నారు.



నిషేధిత భూములతో రైతుల గగ్గోలు

దేవదాయ శాఖ సర్వే నెంబర్లతో కలిసి ఉన్నాయి.... తక్షణం తొలగించాలని రెవెన్యూ సదస్సులో వినతిపత్రాలు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేవదాయ భూముల సర్వే నెంబర్లతో కలిసి తమ భూములు, నిషేధిత భూములు ఉండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, వాటి తొలగింపునకు తక్షణం చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. గురువారం సర్పవరం పంచాయతీ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దారు కల్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు దేవదాయ శాఖ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ, ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజరు పద్మజాదేవి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ఏళ్ల తరబడి రైత్వారీ భూములు దేవదాయ శాఖ భూముల సర్వే నెంబర్లతో కలిసి ఉండడంతో నిషేధిత జాబితాల్లో చేర్చారన్నారు. భూములు ఉన్నా కుటుంబ అవసరాలకు ఉపయోగపడని విధంగా ఉన్నాయన్నారు. శ్రీభావనారాయణ స్వామి ఆలయానికి చెందిన భూములు 43 రికార్డు ప్రకారం 436 ఎకరాలు ఉండాలని, ఇందులో సుమారు 200 ఎకరాలు ఈనాం భూములుగా ఉన్నాయన్నారు. మేడలైన్, తిమ్మాపురం, పనసపాడు గ్రామాల్లో ఉన్న స్వామివారి భూములను సంరక్షించాలని కోరారు. రెవెన్యూ సదస్సుపై అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వలేదని పలువురు రైతులు, గ్రామ పెద్దలు విమర్శించారు. సదస్సు వాయిదా వేయాలని ఆందోళన చేయగా అధికారులు అంగీకరించారు. ఈ నెల 28వ తేదీన మరలా నిర్వహిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దారు సురేష్, సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వో శ్రీను, దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న దేవదాయ శాఖ అధికారి దుర్గాభవానీ

'అపరిచితుల కాల్స్‌కు స్పందించొద్దు'

పిఠాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అపరిచితుల ఫోన్ కాల్స్, మెసేజ్‌లపట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటికి స్పందించవద్దని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని చిన్నమాంబ పార్కును చేర్చి ఉన్న వినాయకుని ఆలయం వద్ద గురువారం సాయంత్రం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. బహుమతులు వచ్చాయని, పార్సిల్ వచ్చిందని, ఓటీపీ వెరిఫికేషన్ కావాలని చెప్తూ కాల్స్, మెసేజ్‌లు వస్తున్నాయని తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో ఉన్న పాన్ కార్డు కోసం ఆధార్, ఇతర వివరాలు అడుగుతున్నారని చెప్పారు. బ్యాంకులు, గ్రామ/వార్డు సచివాలయం నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి ఆధార్, బ్యాంకు ఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డుల నెంబర్లు అడిగితే ఇవ్వవద్దని స్పష్టం చేశారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా మన వివరాలు సైబర్ నేరస్తుల చేతిలోకి వెళ్లిపోతాయని, బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు మాయమయ్యే అవకాశం ఉందని వివరించారు. సదస్సులో పట్టణ ఎస్ఐ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్

జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి: ఎస్ఎఫ్ఐ

గొల్లప్రోలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జి.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. స్థానిక జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన ఎస్ఎఫ్ఐ సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలికోన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, లేకుంటే ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా వర్షిణి, వడ్డి కాసులు, ఉపాధ్యక్షులుగా హేమ, స్వామి, సహాయ కార్యదర్శులుగా బిందు, శివదుర్గ, కమిటీ సభ్యులుగా లక్కీ, వాసవి, మణి, రాంచరణ్, పవన్, హరి, సాయి ఎన్నికయ్యారు. పిఠాపురం కార్యదర్శి సిద్దు పాల్గొన్నారు.



గొల్లప్రోలులో జరిగిన సమావేశంలో ఎన్నికైన ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ప్రతినిధులు



ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న మహిళలు

పిఠాపురంలో మెప్మా బజారు

పిఠాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండు సమీపంలో గల మెప్మా కార్యాలయం వద్ద గురువారం మెప్మా బజారు (అర్బన్ మార్కెట్) నిర్వహించారు. మహిళా సంఘాలు తయారు చేసిన ఆహార ఉత్పత్తులు, సబ్బులు, ఫినాయిల్, సెంట్లు, బ్లౌజులు, కాటన్ చీరలు, నైటీలు, కుట్టిన లంగాలు, వన్‌గ్రామ్ గోల్డ్ వస్తువులు, మసాలా పొడి ప్యాకెట్లు, డెకొరేటివ్ ఐటమ్స్‌ను స్టాల్స్‌లో ఉంచి విక్రయాలు సాగించారు. తాము తయారు చేసిన వస్తువుల ప్రాముఖ్యతను మహిళా సంఘాల సభ్యులు వివరించారు. సీఎంఎం వెంకటలక్ష్మి, సీవోలు ఏడీఎం శైలజ, ఎండీ ఉమ్మే సల్మా, సీహెచ్ శ్రీవల్లి, టీఎల్ఎఫ్ ఓబీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

రేపు ఓఎన్జీసీ నష్టపరిహారం పంపిణీ

తాళ్లరేవు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు శనివారం ఓఎన్జీసీ అందించే నష్టపరిహారం పంపిణీ కార్యక్రమాన్ని మత్స్యకారులంతా పార్టీలకు అతీతంగా విజయవంతం చేయాలని డీసీపీ రాష్ట్ర డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు కోరారు. గురువారం ఆయన తాళ్లరేవులోని టీడీపీ కార్యాలయంలో మత్స్యకార నేతలు, గ్రామ పెద్దలతో జన సమీకరణపై చర్చించారు. టీడీపీ నేతలు మందాల గంగసూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, వాడ్రేవు వీరబాబు, పెమ్మాడి కృష్ణవేణి, ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాడలో పేకాట శిబిరంపై దాడి

ఆరుగురు అరెస్టు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడలో పేకాట శిబిరంపై ఎస్ఐ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.1, 460 స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్ఐ చెప్పారు.

మార్షల్ ఆర్ట్స్ శిక్షకులకు అభినందన

కాకినాడ సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు మార్షల్ ఆర్ట్స్, తైక్వాండోల్లో ఉచిత శిక్షణ ఇస్తున్న మల్లాడి రామారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు గురువారం కలెక్టర్ షాన్ మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల్లో ఆత్మస్థైర్యం నింపడంతో పాటు వ్యక్తిత్వవికాసం పెంపొందించేందుకు శిక్షణ ఇస్తున్న నిర్వాహకులను అభినందించారు. తమకు అవకాశం ఇచ్చిన కలెక్టర్‌కు ట్రస్టు చైర్మన్ మల్లాడి రాజేంద్రప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాయుడు శ్రీనివాసరావు, కోచ్ ప్రత్యూష, ట్రస్టు సభ్యుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

పీబీ దేవంలో రెవెన్యూ సదస్సు

సామర్లకోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబ్రహ్మదేవం గ్రామ చావిడి ఆవరణలో డిప్యూటీ తహసీల్దారు వై.శ్రీనివాసు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి మ్యుటేషన్లు, ఎఫ్‌లైన్ సర్వేలకు చెంది నాలుగు అర్జీలను స్వీకరించారు. తమ భూమిని రాజమహేంద్రవరం ఉమామార్కండేయ స్వామి ఆలయానికి చెందినట్టుగా దేవదాయ శాఖ అధికారులు చూపిస్తున్నారని, అక్కడి అధికారుల చుట్టూ పలు దఫాలు తిరిగినా ఎటువంటి ఫలితం లేదని ఆరుగురు రైతులు తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. సూపరింటెండెంట్ కె.పద్మజ, టీడీపీ నాయకులు తోటకూర శ్రీనివాస్, మార్ని వీరభద్రరావు, కమ్మిల వెంకటేశ్వరరావు, వీఆర్వోలు వి.పద్మావతి, మామిడాల కామరాజు, ఎం.శ్రీనువాసు, ఎం.దుర్గాభవానీ సర్వేయరు సీతారామాచార్యులు, గ్రామ సర్వేయరు స్వాతి, శ్రీనివాసరావు, డీఈవో శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు చంద్రశేఖరరెడ్డి

'విలీన సభను విజయవంతం చేయాలి'

కాకినాడ సిటీ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 28న జరిగే సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రెండు పార్టీల విలీన సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు కోరారు. పాతబస్టాండ్ వద్ద గల ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం విలీన సభ కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జి.రాజ్‌కుమార్, బొడ్డు సత్యనారాయణమూర్తి, లోవరాజు, ఎల్లారావు, దుర్గారావు, సత్తిబాబు, అనూక్ తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ దేవస్థానానికి వంట సామగ్రి అందజేత



పెద్దాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ దేవస్థానానికి గండేపల్లి మండలానికి చెందిన పసుమర్తి సావిత్రి గురువారం వంట సామగ్రి అందజేశారు. వీటిని అన్నప్రసాద తయారీకి వినియోగించాలని దాత కోరినట్టు సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి తెలిపారు.

పిఠాపురంలో సీపీఐ శతాబ్ది వేడుకలు

పిఠాపురం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పేద, బలహీన, అట్టడుగు వర్గాల ప్రజలు, కార్మికుల కోసం సీపీఐ అలుపెరగని పోరాటం చేసిందని ఆ పార్టీ జిల్లా నాయకులు సాకా రామకృష్ణ, కేశవరపు అప్పలరాజు పేర్కొన్నారు. సీపీఐ ఏర్పాటు చేసి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం పట్టణంలోని ఉప్పాడ సెంటర్లో శతాబ్ది వేడుకలు నిర్వహించి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఖండవిల్లి సుబ్బారావు, పెనుమళ్ల గోపాల్‌రెడ్డి, డి.వరప్రసాద్, పేపకాయల ప్రసాద్, సీలం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కరప, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నడకుదురు సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈ ఉదయ్ భాస్కర్, ఏఈ సానా ఈశ్వరప్రసాద్ తెలిపారు. కొత్తగా విద్యుత్ లైన్ పనులు, సబ్ స్టేషన్ నిర్వహణ నిమిత్తం నడకుదురు, గురజనాపల్లి, పెనుగుదురు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

రేపు ప్రముఖ సినీ నటుడు విక్టరీ వెంకటేష్ కాకినాడ రాక

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిరంతరం వినోద కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఒక టీవీ ఛానల్ శనివారం కాకినాడలో సంక్రాంతి సంబరాలు నిర్వహించనుంది. పీఆర్ ప్రభుత్వ కళాశాల గ్రౌండ్ వేదికగా ప్రత్యేక కార్యక్రమం చేపడుతోంది. ఇందులో ప్రముఖ హీరో విక్టరీ వెంకటేష్, డైరెక్టర్ అనిల్ రావిపూడి, ఐశ్వర్యరాజేష్, మీనాక్షి చౌదరి, సీనియర్ నటులు రాజేంద్రప్రసాద్, ఆమని పాల్గొంటున్నారు.

రేపు సామర్లకోటలో జాబ్‌మేళా

సామర్లకోట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట టీటీడీసీ ఆవరణలో శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీరమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడలోని అపిటోరియా ఫార్మా సంస్థలో ప్రొడక్షన్ అసిస్టెంట్లుగా పని చేయడానికి ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులైన 100 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. చిత్తూరు జిల్లా శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్ ఇండియా లిమిటెడ్‌లో అసోసియేట్‌లుగా 40 మంది మహిళా అభ్యర్థులకు ఉపాధి అవకాశాలున్నాయి. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని బ్లూ ఓషియన్ బయోటెక్‌లో 25 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులకు మరిన్ని వివరాలకు జాబ్‌మేళా కో-ఆర్డినేటరు శివను 9440756250, డీపీవో శ్యామ్‌ను 9949156583 నెంబర్లలో సంప్రదించాలని శ్రీరమణి కోరారు.

సచివాలయాల్లో ఎస్సీ ఉప కులాల వివరాలు

గొల్లప్రోలు రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టిన ఎస్సీ ఉప కులాల గణన వివరాలను తెలియజేస్తూ గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల్లో సమాచారాన్ని ప్రచురించారు. గొల్లప్రోలు మండలంలోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో ఎస్సీల్లో ఉప కులాల వారీగా జనాభా, ఇతర వివరాలను ప్రచురించామని తహసీల్దారు సత్యనారాయణ తెలిపారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ కులాలకు సంబంధించిన సమాచారాన్ని పిఠాపురం పట్టణం, మండలంలోని అన్ని వార్డు, గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉంచారు. వీటిని ప్రచురించడంతో పాటు ఎస్సీ కులాలు, ఉప కులాల వివరాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని తహసీల్దారు వీవీ గోపాలకృష్ణ కోరారు. సచివాలయాల్లో సదరు వివరాలు పరిశీలించాలని సూచించారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ తిమ్మాపురం పంచాయతీ కార్యాలయ నోటీసు బోర్డులో ఎస్సీ కుల గణన సోషల్ ఆడిట్ నివేదిక వివరాలను వీఆర్వో నున్న సత్యనారాయణ ప్రదర్శించారు. అభ్యంతరాలు, మార్పులను ఈ నెల 31వ తేదీ వరకు స్వీకరిస్తామన్నారు.



హరిదాసుకి సత్కారం

సర్పవరం జంక్షన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) ధనుర్మాసం నెలంతా సూర్యోదయానికి ముందే శ్రీకృష్ణుడు, గోదాదేవిలను స్మరిస్తూ తిరుప్పావై పఠిస్తూ అక్షయపాత్రను ధరించి గ్రామ సంచారం చేసే హరిదాసు శ్రీకృష్ణుడు ప్రతిరూపమని విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం రమణయ్యపేటలో అడబాల ట్రస్టు అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో హరిదాసుకి నూతన వస్త్రాలు బహూకరించి సత్కరించారు. సభ్యులు ప్రసాద్‌నాయుడు, బి.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్ చోరీ

రౌతులపూడి, డిసెంబరు 26: బలరామపురంలోని రైతు భరోసా కేంద్రంలో ల్యాప్‌టాప్ చోరీ జరిగింది. కార్యాలయం సిబ్బంది పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. బుధవారం విధులు ముగించుకుని తాళం వేసి వచ్చారు. గురువారం ఉదయం రైతులు రైతు సేవా కేంద్రం తాళం పగిలి తలుపులు తీసి ఉండడంతో సిబ్బందికి తెలపగా ల్యాప్‌టాప్ లేదు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

చెరువు చుట్టూ ఆక్రమణలు



చెరువు కబ్జా చేసి భవన నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

జగ్గంపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఎన్నికల సందడి ముగిసింది. కానీ పాడిపండలకు అవసరమైన చెరువును కబళించే వ్యక్తులను అదుపు చేయలేని పరిస్థితి. జగ్గంపేట నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన జగ్గంపేట, గండేపల్లి మండలాలకు ఒక్క అడుగు పరిధిలోనే మండలం విడిపోతుంది. ఈ మధ్య జగ్గయ్య చెరువు ఉంది. ఇది సర్వే నెంబరు 171/11విస్తీర్ణం 28.82 సెంట్లు అయితే ప్రస్తుతం ఈ చెరువు పూర్తిగా దళారుల చేతిలో చిక్కుకుని అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ చెరువును సగంపైగా ఆక్రమించి వ్యాపారస్తులు కబ్జాగా, మరికొందరు నివాస గృహాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు మరికొందరు తాజాగా కట్టడాల నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ చెరువు కింద ఆయకట్టు ఉండి పంటలు పండే పరిస్థితి ఉంది. దీన్ని కబ్జా చేయడం జగ్గంపేట పట్టణంతుఫాన్ కారణంగా వచ్చే వర్షపు నీరువల్ల ప్రతిఏటా రెండు, మూడు సార్లు నీట మునిగి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. పట్టణానికి అతి చేరువలో ఉన్న ఈ చెరువు అన్యాక్రాంతమైపోతున్నా పట్టించుకునే నాధుడే లేదు.

సత్తెమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట

గండేపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో గండేపల్లి కృష్ణుని వీధిలో గురువారం సత్తెమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు కమిటీ సభ్యులు, భక్తుల సహకారంతో ఘనంగా నిర్వహించారు. మురారి ఉపసర్పంచ్ జాస్తి వసంత్, పద్దరాజు పాల్గొన్నారు.

కోడిపందేలపై కౌన్సెలింగ్

జగ్గంపేట రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి):కాట్రావులపల్లిలో కోడిపందేలపై గ్రామ యువతకు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు కౌన్సెలింగ్ నిర్వహించారు. గ్రామంలో జూద క్రీడలు నిర్వహించరాదన్నారు. సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, ఎస్‌ఐ రఘునాధరావు తెలిపారు.

గండేపల్లిలో..

గండేపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోడిపందేలు, గుండాట, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, పందేలు నిర్వహించుకునేందుకు స్థలాలు ఇస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

కంటి వైద్యశిబిరం

గండేపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో వాసన్ ఆస్పత్రి సహకారంతో కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రోఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. డీన్ క్యాంపస్ లైఫ్ మేనేజ్‌మెంట్ వి.సత్యనారాయణ, ప్రోగ్రాం కన్వీనర్ వరప్రసాద్, ఐవి వీరాంజనేయులు పాల్గొన్నారు.

చక్రరావు కుటుంబానికి పరామర్శ

జగ్గంపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం కాండ్రేగులలో ద్వారపూడి చక్రరావు భార్య మృతితో గురువారం జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ పరామర్శించి సంతాపం తెలిపారు. గంథం శ్రీనివాస్, రాజనాల శ్రీను, సూరపురెడ్డి నరేష్, కాయల మణికంఠ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

జగ్గంపేట, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): 33కేవీ రాజపూడి ఫీడర్ నరికివేత, మరమ్మత్తులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటలవరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఏఈ బి.వీరభద్రరావు తెలిపారు.రాజపూడి, కొత్తూరు, మల్లిశాల, వెంగయమ్మపురం, గోవిందపురం, కృష్ణాపురం, సీతారామపురం, జగ్గంపేట జేహెచ్‌సీ, బాలాజీ రైస్‌మిల్లులకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులుసహకరించాలని ఆయన కోరారు.

హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా బొండాడ

ప్రత్తిపాడు, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రత్తిపాడు మండలం ధర్మవరానికి చెందిన బొండాడ నారాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఐహెచ్‌ఆర్‌పీసీకి నారాయుడికి ఉత్తర్వులు అందాయి. కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి ఎస్సీ, ఎస్టీల సమస్యలను, వారి హక్కులు కాపాడడంలో సహకారం అందించాలని కోరారు.

కంప్యూటర్ పితామహుడికి ఘన నివాళి

జగ్గంపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కంప్యూటర్ పితామహుడు బాబేజ్ జయంతి సందర్భంగా ప్రజ్ఞ పాఠశాల కంప్యూటర్ ల్యాబ్‌లో చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో బాబేజ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బాబేజ్ ఆంగ్ల గణితశాస్త్రం, ఇంజనీర్, పొలిటికల్ ఎకనామి శాస్త్రంలో ప్రావీణ్యం పొంది కంప్యూటర్ నిర్మాణ పితామహుడుగా కీర్తిని సంపాదించారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మట్టే శ్రీనివాసరావు, బండారు శ్వేత, కంప్యూటర్ ఉపాధ్యాయులు శ్రావని, బాలిన దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మార్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు అడపా దుర్గారావు నేతృత్వంలో కంప్యూటర్ సృష్టికర్త చార్లెస్ బాబేజ్ జయంతి ఘనంగా గురువారం నిర్వహించారు. మార్స్ కంప్యూటర్స్‌లో చార్లెస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలులర్పించారు. ముఖ్యఅతిథిగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ ప్రగడ ప్రయాగ మూర్తి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నేడు ప్రపంచమంతా కంప్యూటర్‌పై ఆధారపడి ఉందన్నారు. లండన్‌లో జన్మించి కంప్యూటర్ కనిపెట్టి ప్రపంచానికి గొప్ప పరిజ్ఞానాన్ని అందించిన వ్యక్తి చార్లెస్ అని కొనియాడారు. కంప్యూటర్‌పై కోట్లాది యువత ఉపాధి పొందుతున్నారన్నారు. బొప్పన శివ, కోరాడ రాజు, కంపరపు సత్యేంద్ర, ఉప్పాడ అబ్బులు, ఉడతల రమణారావు, రాకేష్ తదితరులు ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

తేమ శాతం ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తాం

● సివిల్ సప్లైస్ డీఎం

రాజవొమ్మంగి, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడన ప్రభావంతో కోసిన ధాన్యంలో తేమశాతం ఎక్కువ ఉండడంతో ప్రభుత్వం కొనుగోలుచేయక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. గురువారం రాజవొమ్మంగి మండలంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్ పర్యటించారు. రాజవొమ్మంగిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. దూసరిపాము గ్రామ శివారు లో రోడ్డుపై ధాన్యం ఆరబెట్టుకున్న రైతులతో ఆయన మాట్లాడారు. ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇకపై తేమ శాతం 19వరకు ఉన్న కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టామని, రైతులు ఎవరూ అధైర్య పడొద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన 48గంటలలోపే లబ్ధిదారులకు సొమ్ము లు జమవుతున్నాయన్నారు. ఇప్పటివరకు రంపచోడవరం నియోజకవర్గంలో 12335 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, వీఆర్వో నానాజీ ఉన్నారు.

అమిత్‌షాను పదవి నుంచి తొలగించాలి

● మావోయిస్టు ఆజాద్ పేరిట విడుదలైన లేఖ

ఎటపాక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) దేశ పార్లమెంట్‌లో డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను ఆపదవీ నుంచి బర్తరఫ్ చేయాలని మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన పేరిట సామాజిక మాధ్య మాల్లో ఓ లేఖ విడుదలైంది. అంబేడ్కర్ 1947 కంటే ముందు దళితులు, ఆదివాసీలు, మత మైనార్టీలు, బడుగు బలహీనవర్గాల ప్రజల కోసం రాజ్యాంగంను రచించారన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతో వారు స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నారు. 2047 నాటికి దేశంను కార్పొరేట్ ఆర్య బ్రాహ్మణ హిందూ దేశంగా మార్చేందుకు టార్గెట్ పెట్టుకున్నారని, మనువాదానికి వ్యతిరేకులైన ఆదివాసీలు, దళితులు, మత మైనార్టీలు, మహిళలు, వెనుబడిన వర్గాల వారు, కమ్యూనిస్టులు, మావోయిస్టులు లాంటి విప్లవ సంస్థలను నిర్మూలించే లక్ష్యంతో ఆపరేషన్ కగార్ పేరుతో యుద్ధంను మొదలుపెట్టి, వందలాది ఆదివాసీలను చంపేశారన్నారు. ఇంకా చంపుతూనే ఉన్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వాలది మానవ హక్కుల ఉల్లంఘనే



సమావేశంలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఆదివాసీ నాయకులు

చింతూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలవరం పరిహారం చెల్లింపుల్లో ప్రభుత్వాలు అనుసరిస్తున్న తీరు మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తోందని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్య నారాయణ ఆరోపించారు. గురువారం చింతూరులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు తాము చేసిన చట్టాలు, ఇచ్చిన ఉత్తర్వులను తామే అమ లు చేయకపోవడం విడ్డూరమన్నారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలు విషయంలో నిర్వాసితులకు అన్యాయం జరుగుతుందన్నారు. భూసేకరణ నోటిఫికేషన్లు కాలదోషం పట్టినప్పటికీ 18 సంవత్సరాల ప్యాకేజీ విషయమై కటాఫ్ డేట్ మార్చడం లేదన్నారు. దీంతో ప్రధానంగా ఎస్టీ, ఎస్సీలు అభద్రతా భావంతో జీవించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. చింతూరు డివిజన్ పరిధి నిర్వాసితులకు న్యాయంచేసే క్రమంలో ప్రభుత్వం కొత్త భూసేకరణ చట్టం అమలుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. జనవరి 3న భారత రాజ్యాంగసభ సభ్యుడు ఆదివాసీ మహాసభ వ్యవస్థాపకుడు జైపాల్‌సింగ్ ముండా జయంతిని గిరిజన ప్రాంతాలలో ఘనంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. న్యాయవాది ఆత్రం నవీన్ కుమార్, పండా కళ్యాణి, తెల్లం రంగమ్మ, పొడియం లక్ష్మణ్, గొంది వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వలంటీర్లపై అసెంబ్లీలో చర్చ జరగాలి

చింతూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వలంటీర్ వ్యవస్థపై వచ్చేనెల రెండున ప్రభుత్వం అసెంబ్లీ సమావేశంలో చర్చించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో చింతూరు డివిజను పరిధి వలంటీర్లు సీఐటీయూ నేతృత్వంలో గురువారం ఐటీడీఏ కార్యాలయం ముందు దీక్ష ప్రారంభించారు. దీక్షలు మూడు రోజుల పాటు సాగనున్నాయి. ఈ సందర్భంగా పల్లపు వెంక ట్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు వలంటీర్లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, సీసం సురేష్, ఆదివాసీ న్యాయవాది ఆత్రం నవీన్ వలంటీర్ అధ్యక్ష కార్యదర్శులు కలుముల మహేష్, సోడె ప్రసాద్, పద్మావతి, శాంతి పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

మోతుగూడెం, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి రవాణా అవుతుందని సమాచారంతో స్థానిక రామాలయంవద్ద ఎస్‌ఐ శివనారాయణ ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు తనిఖీలు చేశారు. పర్యాటకుల ముసుగులో స్మగ్లర్లు గంజాయి రవాణా చేస్తున్నారనే సమాచారంతో తెలంగాణా వైపు వెళ్లే వాహనాలను ఒడిశా సరిహద్దులో పండించే గంజాయిని టూరిస్టులు ముసుగులో తెలంగాణాలోని హైదరాబాద్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన స్మగ్లర్లు గంజా యి సరఫరా చేస్తున్నారని వాహనాలను తనిఖీ చేశారు. గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో విస్తృత తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్‌ఐ రాజేశ్వరరావు, సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ 42వ బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.

ఎస్‌ఐగా అప్పలరాజు బాధ్యతల స్వీకరణ

ఎటపాక, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎటపాక నూతన ఎస్‌ఐగా జి.అప్పలరాజు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పాడేరు స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వర్తిస్తున్న అప్పలరాజు ను ఎటపాకకు బదిలీచేసిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు ఎస్‌ఐగా పనిచేసిన కె.పార్ధసారథి గుర్తేడుకు బదిలీ అయ్యారు.

ఎమ్మెల్యే శిరీషాదేవీపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

● టీడీపీ నాయకుడు బాచినేని, సంపత్

ఎటపాక, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే శిరీషాదేవీ, ఆమె భర్త మఠం భాస్కర్ పై వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ఆ వ్యాఖ్యలను మానుకోవాలని మండల టీడీపీ ఉపాధ్యక్షుడు పాటి సంపత్, మండల ఐటీడీపీ చాంపియన్ బాచినేని శ్రీకాంత్ అన్నారు. గురువారం ఎటపాకలో మాట్లాడారు. ఎమ్మెల్యే శిరీషాదేవీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి, ఓర్వలేక అనంతబాబు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వైసీపీ పాలనలో రంపచోడవరం నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యేగా అనంత బాబు చేసిన దౌర్జన్యాలు, కబ్జాలు, దందాలు ప్రజలందరికీ తెలుసన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

చింతూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి ఒకరు గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ పి.రమేష్ తెలిపారు. మృతుడు కొద్దికాలంగా చింతూరు సెంటరులో బిక్షాటన చేసేవాడన్నారు. మృతుని వివరాలు ఎవరికి తెలిసినా పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా ఎస్‌ఐ కోరారు.

ఆదివాసీ సంక్షేమ, సాంస్కృతిక సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన

రంపచోడవరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) ఆదివాసీ (గిరిజన) సంక్షేమ, సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు కత్తుల ఆదిరెడ్డి ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. రిటైర్డ్ ఓఎన్జీసీ డైరెక్టర్ పందుల కామరాజు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. కురసం ఫకీరుదొర, బొగ్గల కాటంరెడ్డి, సోళ్ల బొజ్జిరెడ్డి, సమర్త కృష్ణ, గంటిమల్ల అప్పలరాజు, గంటిమల్ల సత్యనారాయణ, బొరగ గంగరాజు, కె.చిన్నికృష్ణ, ఎం.చినస్వామిరెడ్డి పాల్గొన్నారు.

రంగాకు ఘన నివాళి



రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న రంగా అభిమాన సంఘం నాయకులు

చింతూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దివంగత నాయకుడు వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతిని గురువారం చింతూరులో నిర్వహించారు. వంగవీటి రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రంగా అభిమానులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయుర్వేద నిపుణుడు జమాల్‌ఖాన్ రంగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్ర మంలో సింగంశెట్టి దుర్గారావు, గూడపు నాగరాజు, శేషునాయుడు, భాస్కరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జ్యోతులకు సత్కారం

జగ్గంపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వగృహంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర కాపు జేఏసీ కన్వీనర్ వాసిరెడ్డి ఏసుబాబు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాకినాడ లీలీ కృష్ణ ఎంటర్‌ప్రైజెస్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యేకు అభినందన సత్కారం చేసి ఆయన ఆయురారోగ్యాలతో మరిన్ని ఉన్నత పదవులతో సేవ చేయాలని ఆకాంక్షించారు. సిద్దునూకరాజు, పేపకాయల నానాజీ, గొల్లపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

'అమిత్ షా రాజీనామా చేయాలి'

ప్రత్తిపాడు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని మండలంలోని లంపకలోవలో గురువారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అంబేడ్కర్‌ను అవమానపరిచేలా హోంమంత్రి అమిత్‌షా మాట్లాడడం దారుణమన్నారు. ఆందోళనలో లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు, అఖిల భారత ప్రగతి శీల మహిళా సంఘం అధ్యక్షురాలు రాజాలరత్నం, వ్యవసాయ కూలీ సంఘం అధ్యక్షుడు దేవతయ్య, చిట్టి మూరి ముసలయ్య, సత్యవతి, అప్పలరాజు, మరియమ్మ, రాంబాబు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో క్రిస్మస్ వేడుకలు

ప్రత్తిపాడు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు తోటవీధిలో హోప్ చర్చిలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ ఇమ్మాను యేలు మాసా ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రిస్మస్ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ఎంఎస్‌వీ ప్రసాద్, యాళ్ల జగదీష్, అంబటి రాంబాబు పాల్గొన్నారు.

'భూసర్వే సమగ్రంగా నిర్వహించాలి'

ఏలేశ్వరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సర్వే డిపార్టమెంట్ అధికారులు భూముల సర్వేను సమగ్రంగా నిర్వహించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మండలంలోని భద్రవరంలో రెవెన్యూ సదస్సు డిప్యూటీ తహశీల్దార్ కుశరాజు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. గ్రామంలో భూసమస్యల మ్యూటేషన్లు, ఎఫ్ లైన్ సర్వేలకు అర్జీలను స్వీకరించారు. ఎంపీటీసీ సభ్యులు కొప్పుల బాబ్జీ, టిఎన్‌టియూసి సభ్యులు జిగటాపు సత్తిబాబు ఉన్నారు.

సబ్ రిజిస్టర్ కార్యాలయం కిటకిటలాడిన

జగ్గంపేట,డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ప్రజల తాకిడితో కళకళలాడింది. 2025లో స్టాంప్ డ్యూటీ పెరుగుతుందని క్రయ,విక్రయదారులు భారీ ఎత్తున సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ చేయించుకోవడానికి క్యూకట్టారు.

'ధాన్యం పూర్తిస్థాయిలో కొనేందుకు చర్యలు చేపడతాం'

కోటనందూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా తడిసిన ధాన్యాన్ని కొనేందుకు చర్యలు తీసుకొంటామని వ్యవసాయశాఖ ఏడీ బుల్లిబాబు అన్నారు. కాకరాపల్లిలోని వరి పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని వరిపంటలను జిల్లా వ్యవసాయశాఖ, పౌరసరఫరాల సిబ్బంది పరిశీలించామని, ఈ నివేదికలను జిల్లా అధికారులకు నివేదికలు అందిస్తామని తెలిపారు. మండలంలో తడిసిన ధాన్యం ఎక్కువగా ముక్క అవుతుందన్నారు ఆ ధాన్యాన్ని కూడా పూర్తిస్థాయిలో కొంటామని తెలిపారు. రంగు మారిన ధాన్యాన్ని కొనేలా చేస్తామని తెలిపారు. మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని హామీఇచ్చారు. కార్యక్రమంలో పౌరసరఫరాలశాఖ టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రావు, వ్యవసాయధికారులు చంద్రశేఖర్, వెంకటలక్ష్మీ, ఎఈవో శివకుమారి, సురేష్, సాయికుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట జీడిపిక్కల కార్మికులు బైఠాయింపు

ప్రత్తిపాడు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఇంటి ఎదుట చిన్నింపేట జీడిపిక్కల కార్మికులు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. 41రోజులుగా జీడిపిక్కల కార్మికులు పోరాడుతున్నా యాజమాన్యం, ఎమ్మెల్యే స్పందించడం లేదని తమకు న్యాయం చేయాలని నినాదాలు చేశారు. చిన్నింపేట జీడిపిక్కల పరిశ్రమ మూసివేయడంవల్ల 400మంది పైబడి కార్మికులు ఉపాధి కోల్పోయి వీధిన పడ్డారన్నారు. శాంతియుతంగా తాము ఆందోళనలు చేస్తున్న పోలీసులు భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన కారులు వాపోయారు. తక్షణమే తమ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో సీఐటీయూ మండల కార్యదర్శి రొంగల ఈశ్వరరావు, కార్మికులు ఎ.వీరబాబు, చక్రధర్, సీహెచ్ గోవింద్, వీరబాబు, లోవరాజు, శివ, దుర్గారావు, పాపారత్నం, శివపార్వతి, సత్యవతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎద్దులను అక్రమంగా తరలిస్తున్న వాహనం సీజ్

ప్రత్తిపాడు, డిసెంబరు 25(ఆంధ్రజ్యోతి): తుని నుంచి రాజమండ్రి వైపు 16వ నెంబరు జాతీయ రహదారిపై బొలేరా వాహనంలో అక్రమంగా 8 ఎద్దులను రవాణా చేస్తున్న వాహనాన్ని ప్రత్తిపాడు వద్ద ఎస్‌ఐ ఎస్.లక్ష్మీకాంతం గురువారం సీజ్ చేశారు. నిర్లక్ష్యంగా వాహనంలో పశువులను కట్టి హైవే మీద నుంచి రాచపల్లి వైపు వాహనాన్ని అతివేగంగా నడపుతున్న వాహనాన్ని చేజ్ చేసి వాహనాన్ని సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను ఉలిగోగుల గోశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. గోవులను, ఎద్దులను, గేదెలను అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

'కూటమి ప్రభుత్వం గ్రామీణవైద్యులకు కమ్యూనిటీ పారామెడిక్స్‌గా గుర్తింపు ఇవ్వాలి'

అన్నవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం జీవోనెంబరు 469, 465లను సమీక్షచేసి కమ్యూనిటీ పారామెడిక్స్‌గా గ్రామీణ వైద్యులకు గుర్తింపు ఇవ్వాలని బేసిక్ మెడికల్ ప్రాక్టీషనర్స్ రాష్ట్ర అధ్యక్షులు కరెళ్ల గణపతిరావు డిమాండ్ చేశారు. గురువారం అన్నవరంలో ఒక ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. పట్టణ, గ్రామీణప్రాంతాల్లో అనుభవ వైద్యులు, ప్రాథమికవైద్యులు పరిధికి మించి వైద్యం చేయరాదని, ప్రాథమిక చికిత్సచేసి మెరుగైన వైద్యంకోసం ప్రభుత్వ వైద్యశాలలకు పంపించాలన్నారు. నెక్కంటిగణేష్, రాఘవచౌదరి, వల్లూరి లోకేష్‌లతో ఎముకలు,నరాలు, ఎమర్జెన్సీకేర్‌పై వైద్యవిజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధ న్యుని సత్యనారాయణ, గౌరవ సలహాదారు ఎస్‌ఏ ఖాదర్, వజ్రపు వినోద్‌కుమార్, అన్నవరం కన్వీనర్స్ గ్రంధి వెంకటరమణ, దేవదాస్, రాజేష్ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్తకు ఆత్మీయ సన్మానం

తుని రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): తుని మండలం హెచ్ కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త ములికి సూరిబాబును ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య కార్యకర్తలతో కలిసి సత్కరించారు. ఇటీవల నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదులో జిల్లాలో ప్రథమస్థానంలో నిలిచి మంచి పనితీరు కనబరచడంపట్ల పార్టీ శ్రేణులతో కలిసి సూరిబాబును అభినందించారు. ఈ కార్యక్రమంలో యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు(అబ్బాయి), మోతుకూరి వెంకటేష్, బంటుపల్లి అనేష్, జక్కానరాము నాయుడు, మంతెన గంగాధర్, అరుగెల నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

రంగాకు ఘన నివాళులు

ఏలేశ్వరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి):కాపు నాయకులు వంగవీటి మోహన్ రంగా వర్ధంతి ఏలేశ్వరంలో ఘనంగా నిర్వహించారు. గురవారం స్థానిక వైఆర్‌సీ వద్ద రంగా విగ్రహానికి అడపా శేషగిరిరావు, మలిరెడ్డి సూరిబాబు పూలమాలలు వేసి నివాలులర్పించారు. రంగా సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రంగా చేసిన సేవలను కొనియాడారు. కాపు నాయకులు పాల్గొన్నారు.

బహుజనులకు రాజ్యాధికారమే రంగా ధ్యేయం

జగ్గంపేట, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): బహుజనులకు రాజ్యాధికారం అనే మహా ఆశయ సాధకుడు దివంగత వంగవీటి మోహన్ రంగా వర్ధంతిని జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మరోతి శివగణేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వత్సవాయి సూర్యనారాయణరాజు, చంద్రమౌళి వెంకటరత్నం కలిసి కాట్రావులపల్లిలో మోహన్‌రంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివగణేష్ మాట్లాడుతూ 36ఏళ్ల క్రితం కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పేద బడుగు,బలహీన వర్గాల తరుపున పేదల ఇళ్లస్థలాలు నిమిత్తం నిరవధిక ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న రంగాను కిరాయి మూకలతో పాశవికంగా చంపించారన్నారు. యువకులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

వంగవీటి ఆశయాలకు అనుగుణంగా..

తుని రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): వంగవీటి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తామని జాతీయ కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూరపు రెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. తుని మండలం మర్లపాడులో ద్వారపూడి జమిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగా వర్ధంతిలో పాల్గొన్నారు. బడుగు, బలహీనతల ఉన్నతికి రంగా చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన అడుగు జాడలు స్ఫూర్తిదాయకమన్నారు. అల్లాడ రాజబాబు, గోపాలపు నానాజీ, నాగం సన్యాసిరావు, వడ్డాది ఏసుబాబు, బండి దొరబాబు, పలివెల అప్పారావు, నాగం వీరబాబుతోపాటు పెద్ద ఎత్తున యువత ఉన్నారు.

జేకే సిటీ ట్రస్టు తరపున సాయం అందజేత

కూనవరం, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచవరం కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గొందిబాబు కుటుంబానికి జమాల్‌ఖాన్ సిటీ ట్రస్టు ద్వారా రూ.5వేలు ఆర్థిక సాయం అందజేసింది. దీంతోపాటు కూనవరం టీడీపీ నాయకులు మరో రూ.3వేలు అందజేశారు. మొత్తం రూ.8వేలు టీడీపీ అరకు పార్లమెంటు ప్రతినిధి ఎడవిల్లి భాస్కరరావు చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు, గడేశుల ప్రేమ్‌చంద్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నమట్టపల్లిలో రెవెన్యూ సదస్సులు

వరరామచంద్రాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చిన్నమట్టపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కన్నాయిగూడెం, తుష్టివారి గూడెం, సున్నవారిగూడెం, పత్తిపాక, గుండుగూడెం గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో భూమి పట్టాల మార్పిడిపై రైతులు దరఖాస్తులు చేసుకున్నారు.ఐటీడీఏ పీవో పీవో అపూర్వభరత్, సర్పంచ్ రామారావు, ఎంపీటీసీ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

గొంటువానిపాలెంలో అవగాహనా సదస్సు

అడ్డతీగల, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలం గొంటువానిపాలెం గ్రామంలో గురువారం అడ్డతీగల సీఐ నరసింహరావు ఆధ్వర్యంలో ఆన్‌లైన్ మోసాలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొంతమంది తెలియని నెంబర్లతో వాట్సాప్ వీడియోకాల్స్ చేసి తాము పోలీసులమని లేక ఇన్‌కమ్‌టాక్స్ అధికారులమని భయభ్రాంతులకు గురిచేసి తమ నుంచి సొమ్ములు దోచుకొనే కుట్రలకు లోనుకావద్దని తెలిపారు. గంజాయి వంటి మత్తుపదార్థాలకు యువత బలి కావద్దని హితం పలికారు. కార్యక్రమంలో అడ్డతీగల ఎస్‌ఐ వినోద్‌కుమార్, గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

రాజవొమ్మంగి, డిసెంబరు 26(ఆంధ్ర జ్యోతి): జనవరి 5,6,7,8 తేదీల్లో కాకినాడలో జరిగే యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల మహాసభల ఆహ్వాన పత్రికను రాజవొమ్మంగి హైస్కూ ల్ ప్రధానోపాధ్యాయులు డీవీ గోపాలకృష్ణ ఆవిష్కరించారు. యూటీఎఫ్ మండలాధ్యక్షుడు పీవీ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ కె.శ్రీను మాట్లాడుతూ పీడీఎఫ్ బలపరిచిన యూటీ ఎఫ్ అభ్యర్థులను పలుమార్లు గెలిపించుకుని దమ్మున్న సంఘంగా రాష్ట్రంలో నిలిచిందన్నారు. ఈ సంఘం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందుకు కాకినాడ నడిబొడ్డున వైభవంగా నాలుగు రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు.